RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

CITIZEN TIMES TELUGU DAILY



VOLUME: 17 | ISSUE: 276 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 01-5-2026 | Pages: 8 | Rs: 2/-

సంపుటి : 17 | సంచిక : 276 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 01-5-2026 | పేజీలు : 8 | రూ: 2/-




## ఏపీ టెన్త్ ఫలితాలు వచ్చేశాయ్

'టెన్త్'లో ఫలించిన లోకేష్ వ్యూహం..

100 రోజుల ప్లాన్ తో మెరుగైన ఫలితాలు

సమష్టి కృషితోనే మెరుగైన ఫలితాలు సాధించామన్న మంత్రి లోకేష్

ఉత్తీర్ణులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. మంత్రి నారా లోకేశ్ ఎక్స్ ద్వారా విడుదల చేశారు. పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించడం అనేది ఐకమత్యంగా, అంకితభావంతో సాధించిన సమష్టి విజయమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇంకా సాధించాల్సింది చాలా ఉందని, అయితే అమలు చేసిన ప్రణాళికలు విజయవంతం కావడం సంతోష కరమని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల్లో నైతిక విలువలు, సమగ్ర వికాసం తరువాయి 2లో..

# "దటీజ్ చంద్రబాబు"..

## సీఎం విందులో మంత్రుల ఆసక్తికర వ్యాఖ్యలు

బిజినెస్ రిఫార్మర్ అవార్డు వేళ ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు ఆత్మీయ విందు

పరిశ్రమల గ్రౌండింగ్ వరకు విశ్రమించవద్దని చంద్రబాబు చెబుతారన్న మంత్రి టీజీ భరత్

పట్టిసీమను విమర్శించిన వారికి రూ.50 వేల కోట్ల సంపదతో సమాధానమిచ్చారన్న నిమ్మల

విశాఖ స్టీల్ ప్రైవేటీకరణను ఆపి రూ.11 వేల కోట్లు ఇప్పించడం చంద్రబాబు ఘనతన్న సత్యకుమార్

సీఎం పనితీరు, దార్శనికతపై పలువురు మంత్రుల ఆసక్తికర వ్యాఖ్యలు

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్-2025' అవార్డు అందుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, వివిధ శాఖల కార్యదర్శులు, విభాగాధిపతులకు ఆత్మీయ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమం సీఎం చంద్రబాబు నాయకత్వ లక్షణాలు, ఆయన పనితీరు, దార్శనికతపై మంత్రులు చేసిన ఆసక్తికర వ్యాఖ్యలకు వేదికైంది. చంద్రబాబుతో కలిసి పనిచేయడంలో తమ అనుభవాలను, ఆయన నుంచి నేర్చుకున్న పాఠాలను మంత్రులు పంచుకున్నారు. ఈ సందర్భంగా పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. పెట్టుబడులు ఆకర్షించడంలో సీఎం చంద్రబాబు తమను పరుగులు పెట్టిస్తారని అన్నారు. "పారిశ్రామికవేత్తలతో ఒప్పందాలు తరువాయి 2లో..



# తమిళనాడులో విజయ్ పార్టీ కీలకం కానుందా?

మే 4న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

234 స్థానాలు కలిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చే నెల 4వ తేదీన వెల్లడి కానున్నాయి. ఎగ్జిట్ పోల్ సరళిని చూస్తే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే మరోసారి అధికారంలోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. కొన్ని సర్వేలు డీఎంకే మేజిక్ తరువాయి 2లో..



## తమిళనాట డీఎంకే పశ్చిమ బెంగాల్‌లో భాజపా

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

తమిళనాడు ఎన్నికల్లో డీఎంకే కూటమి మరోసారి అధికారంలోకి రానుందని మెజారిటీ సర్వేలు అభిప్రాయపడగా.. నేడు విడుదలైన టుడేస్ చాణక్య సంస్థ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తంచేసింది. 234 స్థానాలకు గానూ 125 స్థానాలు (11o/-) రావొచ్చని అంచనా వేసింది. అయితే, తమిళనాట కొత్తగా బరిలోకి దిగిన విజయ్ పార్టీ టీవీకేకు.. అన్నాడీఎంకే కూటమి కంటే ఎక్కువ స్థానాలు వస్తాయంటూ పేర్కొంది. ఆ పార్టీకి 63 స్థానాలు (11o/-) రావొచ్చని తెలిపింది. అన్నాడీఎంకే కూటమి 45 (11o/-) స్థానాలతో మూడో స్థానంలో నిలవొచ్చంది. ఓట్ల శాతం పరంగా చూస్తే డీఎంకే కూటమికి 39 శాతం, టీవీకేకు 30 శాతం, అన్నాడీఎంకే కూటమికి 27 శాతం ఓట్లు రావొచ్చని (3 శాతం అటూఇటుగా) తరువాయి 2లో..

# భారత్‌కు చేరిన పురాతన నిధి..


రూ.116 కోట్ల విలువైన 657 కళాఖండాలు అప్పగించిన అమెరికా

స్మగ్లర్లు సుభాష్ కపూర్, నాన్సీ వీనర్ నెట్‌వర్క్‌పై దర్యాప్తులో వెల్లడి

న్యూయార్క్‌లో జరిగిన కార్యక్రమంలో భారత అధికారులకు అప్పగింత

తిరిగి వచ్చిన వాటిలో అత్యంత విలువైన బుద్ధుడి విగ్రహం కూడా





**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

అక్రమంగా తరలించిన భారత పురాతన సంపద తిరిగి స్వదేశానికి చేరుకుంది. అమెరికాలోని మాన్‌హట్టన్ డిస్ట్రిక్ట్ అటార్నీ (డీఏ) కార్యాలయం సుమారు 14 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 116 కోట్లు) విలువైన 657 పురాతన కళాఖండాలను భారత్‌కు అప్పగించింది. తరువాయి 2లో..

# అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు: మంత్రి లోకేష్

విశ్వవిద్యాలయాలు పరిశోధన, ఆవిష్కరణ కేంద్రాలుగా మారాలని సీఎం చంద్రబాబు ఆదేశం

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కోర్సులను పునర్‌వ్యవస్థీకరించాలని అధికారులకు సూచన

20 లక్షల మందికి పూర్తి నైపుణ్యంతో ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమని స్పష్టీకరణ

ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పాఠ్యాంశాలను రూపొందిస్తున్నామని తెలిపిన మంత్రి లోకేష్

ఉద్యోగ, ఉపాధి అవకాశాల సమాచారం కోసం సమీకృత పోర్టల్ ఏర్పాటు చేయాలని ఆదేశం



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

రాష్ట్రంలో పారిశ్రామిక, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యా కోర్సులను పునర్‌వ్యవస్థీకరిస్తున్నామని, విద్యార్థులకు ప్రపంచస్థాయి నైపుణ్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యాశాఖలో చేపడుతున్న సంస్కరణలను ముఖ్యమంత్రికి వివరించారు. ప్రాథమిక స్థాయి నుంచి తరువాయి 2లో..



## ఎడిటోరియల్

# ఊరకే నమ్మేది లేదు... పార్టీ నేతలకు బాబు క్లాస్

తాను ఎవరికీ ఊరకే నమ్మేది లేదని టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. తాను ఏ పదవి ఇచ్చినా ఎవరికీ ఏ బాధ్యతలు అప్పగించినా కూడా అన్నీ చూసుకునే చేస్తాను అని చెప్పారు తన ఎంపిక చాలా విషయాల మీద ఆధారపడి ఉంటుందని కూడా చెప్పారు ఎవరినీ గుడ్డినా నమ్మి బాధ్యతలు అప్పగించను అని బాబు తేల్చి చెప్పారు. తాను నాయకుడిని నమ్మాను అంటే దాని కంటే ముందు రాష్ట్రం గురించి ఆలోచించి ఆ దిశగా పనిచేసే వారినే చూస్తాను అని బాబు చెప్పుకొచ్చారు. చంద్రబాబు గతానికి భిన్నంగా తొలిసారిగా పార్టీ సమావేశాలలో మనసు విప్పారు. తను పార్టీ కోసం రాష్ట్రం కోసం మాత్రమే పనిచేస్తాను అని ఆయన క్లారిటీ ఇచ్చారు. ఈ విషయాల్లో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే ఉండదని అన్నారు. నాకు రాష్ట్రమే ముఖ్యమని బాబు పార్టీ నేతలకు స్పష్టం చేశారు. అందువల్ల తాను బాధ్యతలు అప్పగించిన వారు కూడా అంతే కమిట్ మెంట్ తో పనిచేయాల్సి ఉంటుందని బాబు దిశా నిర్దేశం చేశారు. పార్టీ ఇచ్చిన పదవికి కట్టుబడి ప్రతీ ఒక్కరూ న్యాయం చేయాలని బాబు కోరారు. పదవి అన్నది ఒక బాధ్యతగా ఆయన చెప్పారు. తమకు పదవి దక్కిందని కూర్చోకుండా అందరినీ కలుపుకుని పోవాలని బాబు కోరారు. కో ఆర్డినేట్ చేసుకుని ముందుకు సాగడం నాయకుల లక్షణంగా ఆయన వివరించారు. అదే సమయంలో నిర్ణయాలు కూడా తగిన సమయంలో తగిన విధంగా తీసుకోవాలని అది పార్టీని ముందుకు నడిపించేలా ఉండాలని ఆయన కోరారు. నాయకుల సమర్ధతకు గీటు రాయి పనితీరే తప్ప మరోటి కాదని చంద్రబాబు తేల్చేశారు. ప్రతీ పోలింగ్ బూత్ లోనూ ఓట్లు గణనీయంగా పెంచాలని ఆయన కోరారు. గతంలో వచ్చిన ఓట్లు కంటే ఈసారి ఎక్కువగా రావాలని అన్నారు. 2024 లో వచ్చిన ఓట్లు ఎన్నో లెక్క తీసుకుని 2029లో దాని కంటే ఎక్కువ తేవాలని ప్రతీ నాయకుడి సమర్ధతకు అదే గీటు రాయి అవుతుందని బాబు స్పష్టం చేశారు. పార్టీని ఎక్కడికక్కడ బలోపేతం చేయాలని బాబు పిలుపు ఇచ్చారు. 2024 కంటే ఎక్కువ ఓట్ల శాతం సాధిస్తేనే నాయకులుగా గెలిచినట్లు అని బాబు చెప్పుకొచ్చారు. పార్టీ ప్రతిష్ట కూడా దాంతోనే ముడి పడి ఉందని అంతా గుర్తెరగాలని ఆయన కోరారు. మొత్తం మీద చూస్తే చంద్రబాబు పార్టీ నేతలకు ఇచ్చిన పదవులు అన్నవి అలంకారం కాదని వివరంగానే తెలిపారు. బాధ్యతగా పదవులు అందుకోవాలని పార్టీ కోసం పనిచేయాలని ఆయన చెప్పారు. దాంతో 252 మంది దాకా పార్టీ రాష్ట్ర స్థాయి జాతీయ స్థాయి కమిటీలలో అవకాశాలు దక్కించుకున్న వారు అంతా ఇపుడు అధినేత బాబు మాటలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాల్సి ఉందని అంటున్నారు. పైగా మై టీడీపీ యాప్ లో ఎప్పటికప్పుడు పార్టీ నాయకుల పనితీరుని బేరీజు వేస్తూ అధినాయకత్వం వెన్నంటి ఉంటుంది. దాంతో పదవులూ ప్రమాణం అన్నదే సంబరం కాదని ముందు ముందు పనిచేసి జనంలోనూ పార్టీ పెద్దల మనసులోనూ స్థానం సంపాదించాల్సిందే అని అంటున్నారు. చూడాలి మరి ఎంత మంది తమ్ముళ్ళు చంద్రబాబు సూచించిన విధంగా పార్టీ కోసం శ్రద్ధ వహించి పని చేస్తారో.

# ఏపీ 'పది' ఫలితాలు వచ్చేశాయ్

కోసం మరింత కృషి చేయనున్నట్లు తెలిపారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేస్తున్న కృషికి సమాజ సహకారం ఎంతో అవసరమని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేశారు. ఫెయిలైన వారు ఆత్మన్యూనతకు గురికావొద్దని, పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం సాధించవచ్చని భరోసా ఇచ్చారు.

**100-రోజుల కార్యాచరణ ప్రణాళిక..:** "పూను స్పర్థలు విద్యలందే- వైరములు వాణిజ్యమందే" అనే గురజాడ మాటలను స్ఫూర్తిగా తీసుకుని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' మిషన్ ప్రారంభమైంది. ఇందులో భాగంగా రూపొందించిన '100-రోజుల కార్యాచరణ ప్రణాళిక' సత్ఫలితాలనిచ్చింది. 2025 డిసెంబర్ 6 నుంచి 2026 మార్చి 15 వరకు పకడ్బందీగా అమలు చేసిన ఈ ప్రణాళికలో, విద్యార్థులపై ఒత్తిడి లేకుండా 46 స్లిప్ టెస్టులు నిర్వహించారు. ఈ మార్కులను 'లీప్' మొబైల్ యాప్‌లో నమోదు చేసి, ప్రతిరోజూ 6 డ్యాష్‌బోర్డ్‌ల ద్వారా విశ్లేషించారు.

**షైనింగ్ స్టార్స్ .. రైజింగ్ స్టార్స్..:** స్లిప్ టెస్టులలో విద్యార్థుల ప్రతిభ ఆధారంగా వారిని 'షైనింగ్ స్టార్స్', 'రైజింగ్ స్టార్స్'గా గుర్తించారు. వారి వారి సామర్థ్యాలకు అనుగుణంగా ప్రత్యేక బోధన అందించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

**సాధనే విజయం..:** "సాధనమున పనులు సమకూరు ధరలోన" అన్న వేమన వాక్కును నిజం చేస్తూ, విద్యార్థులతో క్రమం తప్పకుండా సాధన చేయించడం వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఇందుకోసం విద్యాశాఖ ప్రత్యేకంగా మోడల్ పేపర్లు, క్వశ్చన్ బ్యాంకులను ఉచితంగా అందించింది. ముఖ్యంగా, నాన్-లాంగ్వేజ్ సబ్జెక్టుల కోసం ద్విభాషా (బై-లింగ్వల్) పద్ధతిలో, ఒకవైపు తెలుగు మరోవైపు ఇంగ్లీషులో ప్రశ్నపత్రాలు రూపొందించి ఇవ్వడం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడింది.

**ఏ ఒక్క అవకాశం జారకుండా..:** డ్యాష్‌బోర్డ్ విశ్లేషణ ద్వారా విద్యార్థుల బలాబలాలను ముందుగానే అంచనా వేశారు. దీనికి అనుగుణంగా ప్రతి పాఠశాలకు 15 కార్యాచరణ ప్రణాళిక పుస్తకాలను పంపిణీ చేశారు. స్లిప్ టెస్టులలో వెనుకబడిన విద్యార్థుల కోసం 30 రోజుల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌ను ప్రత్యేకంగా నిర్వహించి, వారిపై దృష్టి సారించారు. పరీక్షల ఒత్తిడిని తగ్గించేందుకు ప్రీ-ఫైనల్, గ్రాండ్ టెస్టులు నిర్వహించారు.

**అమలు చేసిన పథకాలు ఇవీ..:** ఈ కార్యాచరణ ప్రణాళికతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కూడా విద్యార్థులకు అండగా నిలిచాయి. రుచికరమైన మధ్యాహ్న భోజనం, 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' పేరుతో యూనిఫాం, బ్యాగు, షూ, పుస్తకాలు వంటివి ఉచితంగా అందించారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా తల్లులకు ఆర్థిక ప్రోత్సాహం కల్పించారు. ఈ సమన్వయ కృషి ఉత్తమ ఫలితాలకు బాటలు వేసింది.

**కృషికి తగ్గ ఫలితాలు..:** మంత్రి నారా లోకేష్ పర్యవేక్షణ, అధికార యంత్రాంగం కృషి ఫలితంగా, మార్చి 2026 పదో తరగతి పరీక్షల ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగింది. గతేడాది 81.1%గా ఉన్న ఉత్తీర్ణత, ఈ ఏడాది 85.25 శాతానికి చేరింది. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఉత్తీర్ణత 72.8% నుంచి 78.39 శాతానికి పెరగడం విశేషం.

**భళా బాలిక..:** ఈ ఏడాది ఫలితాల్లో బాలుర కంటే బాలికలు పైచేయి సాధించారు. బాలుర ఉత్తీర్ణత 82.68% కాగా, బాలికలు 87.90% ఉత్తీర్ణతతో సత్తా చాటారు. బాలుర కంటే 5.22% అధిక ఉత్తీర్ణత సాధించి 'భళా' అనిపించుకున్నారు.

**ప్రైవేటు కంటే ప్రభుత్వ పాఠశాలలే మిన్న..:** రాష్ట్రవ్యాప్తంగా సున్నా శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలు 16 ఉండగా, వాటిలో 11 ప్రైవేట్ పాఠశాలలు కావడం గమనార్హం. ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని పాఠశాలలు కేవలం 5 మాత్రమే ఈ జాబితాలో ఉన్నాయి. ఇది ప్రభుత్వ విద్య నాణ్యతకు నిదర్శనంగా నిలుస్తోందని విద్యా వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**ఏపీ టెన్త్ ఫలితాల ట్రెండ్ పై సీఎం చంద్రబాబు ఏమన్నారంటే...!**

ఆంధ్రప్రదేశ్‌లో విడుదలైన పదో తరగతి ఫలితాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. ఉత్తీర్ణత శాతం గతేడాదితో పోలిస్తే గణనీయంగా పెరగడంపై హర్షం వ్యక్తం చేశారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ సోషల్ మీడియా వేదికగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాశాఖ పనితీరును, మంత్రి నారా లోకేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఏడాది పదో తరగతిలో 85.25 శాతం ఉత్తీర్ణత నమోదవడంపై చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. గత ఏడాది ఇది కేవలం 81.1 శాతంగా మాత్రమే ఉందని గుర్తుచేశారు. బాలురతో పోలిస్తే బాలికలు 5.22 శాతం అధిక ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు మెరుగుపడటాన్ని ఆయన ప్రస్తావించారు. గతేడాది 72.8 శాతంగా ఉన్న ప్రభుత్వ బడుల ఉత్తీర్ణత, ఈసారి 78.39 శాతానికి పెరగడం స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్యాశాఖ రూపొందించిన 100 రోజుల ప్రణాళిక సత్ఫలితాలను ఇచ్చిందని చంద్రబాబు కొనియాడారు. ఈ విజయం వెనుక ఉన్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, శాఖాధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బందిని అభినందిస్తున్నానని తెలిపారు. పిల్లల్లో నైతిక విలువలతో పాటు సమగ్ర విద్యా వికాసానికి విద్యాశాఖ చేస్తున్న కృషిని మరింత ముందుకు తీసుకువెళ్లాలని ఆయన ఆకాంక్షించారు.

# "దటీజ్ చంద్రబాబు"..

కుదుర్చుకోవడంతో సరిపెట్టకుండా, ఆ పరిశ్రమలు వాస్తవంగా కార్యకలాపాలు ప్రారంభించే (గ్రౌండింగ్) వరకు విశ్రమించవద్దని సీఎం పదే పదే గుర్తుచేస్తుంటారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా ఉండేందుకు, సమన్వయం కోసం ఏకంగా 90 మంది అధికారులతో ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని పనిచేస్తున్నాం" అని ఆయన వివరించారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. చంద్రబాబు ముందుచూపును కొనియాడారు. "ఒకప్పుడు ఇంజనీరింగ్ చదువుల కోసం విద్యార్థులు పొరుగు రాష్ట్రాలకు వెళ్లేవారు. అలాంటి పరిస్థితుల్లో రాష్ట్రాన్ని ఇంజనీరింగ్ కాలేజీలతో నింపి 'నాలెడ్జ్ ఎకానమీ'కి చంద్రబాబు పునాదులు వేశారు. ఆయన పట్టిసీమ ప్రాజెక్టును చేపట్టినప్పుడు దాన్ని 'ఒట్టిసీమ' అని ఎంతోమంది విమర్శించారు. కానీ, అదే పట్టిసీమ రూ.50 వేల కోట్ల సంపదను సృష్టించి విమర్శకుల నోళ్లు మూయించింది. దటీజ్ చంద్రబాబు" అంటూ ప్రశంసించారు. ఆయన నాయకత్వంలోనే రికార్డు స్థాయిలో హంద్రీ-నీవా జలాలను రాయలసీమకు తీసుకెళ్లామని గుర్తుచేశారు. వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తన అనుభవాలను సరదాగా పంచుకున్నారు. "సింగపూర్ అధ్యయన పర్యటనకు వెళ్లినప్పుడు, తిరిగొచ్చాక చంద్రబాబు ఏం ప్రశ్నలు అడుగుతారోనన్న భయంతో ఏడు రోజుల పాటు క్రమం తప్పకుండా క్లాసులకు హాజరయ్యాం. నేను కాలేజీ రోజుల్లో కూడా ఇంత సీరియస్‌గా చదువుకోలేదు. సింగపూర్‌లో మాత్రం భుజాన బ్యాగ్ వేసుకుని సీరియస్ స్టూడెంట్‌లా క్లాసులు విన్నాను" అని నవ్వుతూ చెప్పారు. ఇదే సమయంలో చంద్రబాబు సాధించిన ఓ అసాధారణ విజయాన్ని ఆయన గుర్తుచేశారు. "విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పెట్టుబడుల ఉపసంహరణకు కేంద్రం నిర్ణయం తీసుకుంటే, సీఎం చంద్రబాబు వారిని ఒప్పించి ఏకంగా రూ.11 వేల కోట్లకు పైగా నిధులు ఇప్పించారు. అంత పెద్ద నిర్ణయంలో ప్రధాని మనసును ఆయన ఎలా మార్చారో ఇప్పటికీ ఆశ్చర్యంగానే ఉంది" అని వ్యాఖ్యానించారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "రాజకీయాల్లో 'రిఫార్మర్' అనే పదానికి నిజమైన నిర్వచనం సీఎం చంద్రబాబు. తాను రిలాక్స్ అవ్వకుండా నిరంతరం పనిచేయడమే కాకుండా, తన బృందం కూడా అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆయన ఆశిస్తారు. అప్పుడే ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి రెండూ అందించగలమని ఆయన బలంగా నమ్ముతారు" అని తెలిపారు. మొత్తంగా ఈ విందు సమావేశం చంద్రబాబు నాయకత్వ పటిమ, పాలనలో ఆయనదైన మార్క్‌ను మరోసారి చాటిచెప్పింది.

# అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు: మంత్రి లోకేష్

ఉన్నత విద్య వరకు పాఠ్యాంశాలను మార్పు చేయడంతో పాటు, విద్యార్థులకు బ్రిడ్జి కోర్సులు కూడా అందిస్తున్నామని లోకేష్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌సీఆర్టీ సహకారంతో ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా పాఠ్యాంశాలను తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. బోధనా పద్ధతులపై అధ్యయనం చేసేందుకు అత్యుత్తమ ఉపాధ్యాయులను ఫిన్‌లాండ్ వంటి దేశాలకు పంపుతున్నామని వివరించారు. 'టీచర్-స్టూడెంట్-అవుట్‌కమ్' అనే విధానంలో విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నామన్నారు. 'బడి కోసం' కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని, ఎన్‌రోల్‌మెంట్ పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాలేజీ పనివేళలు పెంచి, విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా శిక్షణ ఇస్తున్నట్లు స్పష్టం చేశారు.

**విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు: సీఎం చంద్రబాబు**

మంత్రి లోకేష్ వివరణ అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భవిష్యత్ అవసరాలను ముందుగా అంచనా వేసి, అందుకు తగిన కోర్సులను రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలు ఇచ్చే కేంద్రాలుగా కాకుండా పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌లకు కేంద్రాలుగా మారాలని ఆకాంక్షించారు. గేమ్ ఛేంజర్‌లుగా మారనున్న లాజిస్టిక్స్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో కొత్త కోర్సులు రావాల్సిన అవసరం ఉందన్నారు. క్వాంటం టెక్నాలజీపై రాష్ట్రంలో మొదటి కోర్సును ప్రారంభించినందుకు ఆంధ్రా యూనివర్సిటీని అభినందించారు. ప్రపంచంలోని టాప్ 200 యూనివర్సిటీలతో భాగస్వామ్యం కుదుర్చుకోవాలని, ప్రతి యూనివర్సిటీకి ఒక పారిశ్రామిక సంస్థ అనుసంధానమై ఉండాలని సీఎం స్పష్టం చేశారు. యూనివర్సిటీల్లో జర్మన్ సహా ఇతర విదేశీ భాషల్లో శిక్షణ కోసం ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

**నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ కల్పనపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్రంలోని యువత నైపుణ్య స్థాయిని అంచనా వేసేందుకు 'ర్యాండమ్ స్కిల్ ఆడిట్' నిర్వహించాలని సీఎం ఆదేశించారు. యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలు అందించేందుకు ప్రముఖ కంపెనీలతో అనుసంధానం కావాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో 20 లక్షల మందికి పూర్తి నైపుణ్యంతో కూడిన ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమన్నారు. గత 22 నెలల్లో వివిధ మార్గాల ద్వారా 7 లక్షల మందికి ఉపాధి లభించిందని, ఈ వివరాలన్నింటినీ 'నైపుణ్యం' అనే సమీకృత పోర్టల్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించేలా మధ్యాహ్న భోజన మెనూను రూపొందించాలని, హాస్టళ్లలో కిచెన్ గార్డెన్లను ప్రోత్సహించాలని సూచించారు. 'లీప్' యాప్ ద్వారా విద్యార్థుల పురోగతిని తల్లిదండ్రులు తెలుసుకునేలా చూడాలన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు 'స్టూడెంట్స్ ఇన్నోవేషన్ కాంక్లేవ్' పేరుతో ఏఐ కాన్ఫరెన్స్ నిర్వహించాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షలో పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# తమిళనాడులో విజయ్ పార్టీ కీలకం కానుందా?

ఫిగర్‌కు కొద్ది దూరంలో ఉంటుందని అంచనా వేశాయి. ఈ నేపథ్యంలో అన్నాడీఎంకే విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీతో సంప్రదింపులు జరపడానికి సిద్ధమైనట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. డీఎంకే, అన్నాడీఎంకేలు మేజిక్ ఫిగర్‌కు దగ్గరగా ఆగిపోతే, విజయ్ పార్టీ కీలకంగా మారుతుందని భావిస్తున్నారు. విజయ్ పార్టీకి 4 నుంచి 30 సీట్ల వరకు వస్తాయనే అంచనాలు వెలువడ్డాయి. యాక్సిస్ మై ఇండియా ఒక్కటే టీవీకే పార్టీ 98 నుంచి 120 సీట్ల వరకు గెలుచుకుంటుందని తెలిపింది. యాక్సిస్ మై ఇండియా అంచనాల ప్రకారం విజయ్ పార్టీ 98 నుంచి 120 సీట్లు గెలుచుకుని, డీఎంకే నేతృత్వంలోని కూటమితో సమానంగా నిలుస్తుందని తెలిపింది. డీఎంకే - కాంగ్రెస్ కూటమి 92 నుంచి 110 సీట్లు, ఎన్డీయే 22 నుంచి 32 సీట్లు గెలుచుకుంటాయని అంచనా వేసింది. ముఖ్యమంత్రి పదవికి విజయ్ అత్యంత ప్రాధాన్యత కలిగిన అభ్యర్థిగా 37 శాతం మద్దతుతో నిలిచారని, 35 శాతం మద్దతుతో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కంటే స్వల్పంగా ముందున్నారని కూడా ఈ ఎగ్జిట్ పోల్ తెలిపింది. యువ ఓటర్లలో టీవీకేకు బలమైన మద్దతు ఉందని వెల్లడించింది. 18 నుంచి 19 ఏళ్ల మధ్య వయసున్న తొలిసారి ఓటు వేస్తున్న వారిలో 68 శాతం, 20 నుంచి 29 ఏళ్ల మధ్య వయసున్న వారిలో 59 శాతం, 30 నుంచి 39 ఏళ్ల మధ్య వయసున్న వారిలో 45 శాతం మద్దతు విజయ్‌కి ఉందని సర్వే అంచనా వేసింది.

# తమిళనాట డీఎంకే.. పశ్చిమ బెంగాల్‌లో భాజపా

అంచనా వేసింది.

**పశ్చిమ బెంగాల్‌లో భాజపాకే అవకాశం!**

ఉత్కంఠగా సాగిన పశ్చిమ బెంగాల్ పోరులో భాజపాకు విజయావకాశాలు ఉన్నాయని టుడేస్ చాణక్య సర్వే సంస్థ అభిప్రాయపడింది. 294 స్థానాలకు గానూ 192 స్థానాలు (11o/-) ఆ పార్టీకి రావొచ్చని అంచనా వేసింది. తృణమూల్ కాంగ్రెస్ కూటమికి 100 సీట్లు (11o/-) రావొచ్చని పేర్కొంది. ఇతరులకు 0-2 స్థానాలు రావొచ్చని పేర్కొంది. భాజపాకు 48 శాతం ఓటింగ్ (3 శాతం o/-), తృణమూల్‌కు 38 శాతం (3 శాతం o/-), ఇతరులకు 14 శాతం (3 శాతం o/-) ఓటింగ్ రావొచ్చని టుడేస్ చాణక్య అభిప్రాయపడింది. ఇక కేరళలో అధికార ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ మధ్య గట్టి పోటీ ఉండబోతోందని టుడేస్ చాణక్య అంచనా వేసింది. అయితే, యూడీఎఫ్‌కే ఎడ్జ్ ఉందని అభిప్రాయపడింది. 140 స్థానాలకు గానూ 69 (9o/-) రావొచ్చని పేర్కొంది. అస్సాంలో 50 శాతం ఓట్లు, 102 సీట్లతో భారీ భాజపా భారీ విజయం అందుకోబోతోందని పేర్కొంది.

# భారత్‌కు చేరిన పురాతన నిధి..

న్యూయార్క్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మాన్‌హట్టన్ డీఏ ఆల్విన్ ఎల్ బ్రాగ్ జూనియర్, ఈ కళాఖండాలను భారత కాన్సులేట్ అధికారులకు లాంఛనంగా అందజేశారు. అంతర్జాతీయ స్మగ్లింగ్ నెట్‌వర్క్‌లపై సుదీర్ఘకాలంగా జరుపుతున్న దర్యాప్తులో భాగంగా ఈ పురాతన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు డీఏ కార్యాలయం తెలిపింది. ముఖ్యంగా, అంతర్జాతీయ స్మగ్లర్‌గా ఆరోపణలు ఎదుర్కొంటున్న సుభాష్ కపూర్, ఇప్పటికే దోషిగా తేలిన నాన్సీ వీనర్‌తో సంబంధం ఉన్న నెట్‌వర్క్‌ల నుంచి వీటిని రికవరీ చేశారు. భారత్‌లోని వివిధ ప్రాంతాల నుంచి, ముఖ్యంగా మధ్యప్రదేశ్ ఆలయాలు, ఛత్తీస్‌గఢ్ మ్యూజియంల నుంచి ఈ కళాఖండాలను దొంగిలించి, అక్రమంగా అమెరికాకు తరలించినట్లు అధికారులు గుర్తించారు. తిరిగి అప్పగించిన వాటిలో 2 మిలియన్ డాలర్ల విలువైన 'కాంస్య అవలోకితేశ్వర' విగ్రహం, 7.5 మిలియన్ డాలర్ల విలువైన 'ఎర్ర ఇసుకరాయి బుద్ధుడి' విగ్రహం వంటి అత్యంత విలువైనవి ఉన్నాయి. "భారతదేశ సాంస్కృతిక సంపదను లక్ష్యంగా చేసుకుని భారీ స్థాయిలో స్మగ్లింగ్ జరిగింది. మరిన్ని వస్తువులను తిరిగి అప్పగించేందుకు మా బృందాలు నిరంతరం కృషి చేస్తున్నాయి," అని డీఏ ఆల్విన్ బ్రాగ్ పేర్కొన్నారు. ఈ సహకారానికి భారత కాన్సుల్ జనరల్ బినయ ప్రధాన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సుభాష్ కపూర్‌ను 2022లో భారత్‌లో దోషిగా నిర్ధారించారు. అతడిని విచారణ నిమిత్తం అమెరికాకు అప్పగించే ప్రక్రియ ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది.

# బాధితుడికి అండగా నిలిచిన వాసుపల్లి గణేష్



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 30**

దక్షిణ నియోజకవర్గం 39వ వార్డులో ఒంటరిగా జీవిస్తున్న జాలారి వర్గానికి చెందిన క్యాన్సర్ రోగి చింతపల్లి లక్ష్మణరావుకు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆర్థికంగా అండగా నిలిచారు. స్థానిక యువత, 39వ వార్డు వైఎస్సార్సీపీ అధ్యక్షుడు ముజీబ్ ఖాన్ కలిసి ఆయన పరిస్థితిని వాసుపల్లి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన వాసుపల్లి స్వయంగా వెళ్లి 5,000 నగదు సాయం అందజేశారు. ఇప్పటికే కొంతమంది యువకులు లక్ష్మణరావుకు చిన్న షెడ్ ఏర్పాటు చేసి సహాయం అందిస్తుండగా, వాసుపల్లి ఆయనకు ధైర్యం చెబుతూ మెరుగైన వైద్యం అందేలా చూడాలని కేజీహెచ్ సూపరింటెండెంట్‌తో మాట్లాడినట్లు తెలిపారు. అవసరమైన వైద్య ఖర్చులకు కూడా తాను సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్య, వెంకటి, సలీం, ధనరాజు, రవి, కాసుబాబు, సంస్కృత విభాగం రాష్ట్ర కార్యదర్శి సాగర్, చేపల నూకరాజు, 39వ వార్డు వైఎస్సార్సీపీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బుద్ధ జయంతి సందర్భంగా నేడు మాంసం దుకాణాలకు సెలవు



విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :30

గౌతమ బుద్ధుని జయంతి సందర్భంగా మే 1 (శుక్రవారం) రోజున మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలోని అన్ని మాంసం, చికెన్, చేపలు, రొయ్యల దుకాణాలు మరియు జంతు వధశాలలకు సెలవు ప్రకటించినట్లు జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి. నరేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో మాంసం, చేపలు, రొయ్యలు తదితరాల విక్రయాలను పూర్తిగా నిషేధించినట్లు పేర్కొన్నారు. అందువల్ల సంబంధిత దుకాణదారులు తమ దుకాణాలను మూసివేయాలని, జంతు వధశాలలు కూడా కార్యకలాపాలు నిలిపివేయాలని సూచించారు. ఆదేశాలను అతిక్రమించి ఎవరైనా దుకాణాలు తెరిచి మాంసం, చేపలు, రొయ్యలు విక్రయించినా లేదా జంతు వధశాలలు నిర్వహించినా, వారిపై జీవీఎంసీ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

# పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి అధికారులకు ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్ విజయ క్రిష్ణన్

**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 30**

జిల్లాలో గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యంగా అమలు చేస్తున్న పల్లె పండుగ--2 కార్యక్రమంలో భాగంగా మంజూరైన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులను మే 15 నాటికి పూర్తి చేసి, సంబంధిత బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. పనుల అమలులో ఎటువంటి ఆలస్యం లేకుండా అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా పిఎంజిఎస్ వై,నాబార్డ్ , ఏపీఆర్ఆర్పి, ప్రాజెక్టుల పరిధిలో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. అన్ని పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.



# పోలీస్ సేవలకు అంకితభావం

## - శ్రీనివాసరావు సేవలకు ప్రశంసలు : ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి

**పార్వతీపురం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :30**

పదవీ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుల్ ఏ. శ్రీనివాసరావు (హెచ్ -263)ను జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి, ఐపీఎస్ ఘనంగా సత్కరించారు. పోలీస్ శాఖలో 36 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా సేవలందించిన శ్రీనివాసరావును జిల్లా పోలీస్ కార్యాలయంలో శాలువా, పూలదండలతో సత్కరించి జ్ఞాపిక అందజేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు. విధుల్లో ఎన్నో సవాళ్లను ఎదుర్కొని, కష్టనష్టాలు అధిగమించి విజయవంతంగా పదవీ విరమణ పొందడం అదృష్టమని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మూడు దశాబ్దాలకు పైగా పోలీస్ శాఖకు అంకితభావంతో సేవలందించారని, కుటుంబ సహకారం వల్ల విధులను సమర్ధవంతంగా నిర్వహించి శాఖకు మంచి పేరు తీసుకొచ్చారని అభినందించారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఎలాంటి సమస్యలైనా ఉంటే పోలీస్ కుటుంబ సభ్యుడిగానే భావించి



సంప్రదించాలని సూచించారు. రిటైర్మెంట్ ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పదవీ విరమణ పొందిన శ్రీనివాసరావు మాట్లాడుతూ, తనకు అందించిన ఆత్మీయ వీడ్కోలు జీవితాంతం మరువలేనిదని ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం. వెంకటేశ్వరరావు, ఏఆర్



ఆర్ఐలు నాగేశ్వరరావు, నాయుడు, రాంబాబు, ఏ-సూపరింటెండెంట్ శంకరరావు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పశుసంవర్ధక రంగానికి నూతన దిశా నిర్దేశం

- "పశుసంవర్ధక మార్గదర్శిని" ఈ - మేగజైన్‌తో రైతులకు శాస్త్రీయ మార్గనిర్దేశం
- పాడి పశువుల నుంచి కోట్ల ఆర్థిక వృద్ధి - రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు
- ప్రతి ఇంటికో ఎంట్రప్రెన్యూర్ లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు - మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి/విజయవాడ,:( సిటిజన్ టైమ్స్):ఏప్రిల్ 30:**



రాష్ట్రంలో పశుసంవర్ధక రంగ అభివృద్ధిని మరింత వేగవంతం చేయాలనే ఉద్దేశంతో "పశుసంవర్ధక మార్గదర్శిని" ఈ-మేగజైన్‌ను రాష్ట్ర వ్యవసాయ, పాడిపరిశ్రమాభివృద్ధి శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది రైతులు పాడి పశువులు, సన్న జీవాలు, నాటు కోళ్ల పెంపకంతో అనుబంధం కలిగి ఉన్నారని తెలిపారు. 2025--26 సంవత్సరానికి పశుసంవర్ధక శాఖ ద్వారా రూ.1,76,151 కోట్ల స్థూల విలువ వృద్ధి నమోదవడం ఈ రంగ ప్రాధాన్యతను స్పష్టంగా చూపుతోందన్నారు. అయినప్పటికీ సంప్రదాయ యాజమాన్య పద్ధతులు, కూలీల కొరత, పశు గ్రాసాల లోపం, పెరుగుతున్న దాణా ఖర్చులు వంటి సమస్యల కారణంగా ఆశించిన స్థాయి వృద్ధి సాధ్యంకావడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువత శాస్త్ర సాంకేతిక రంగాల వైపు మొగ్గు చూపుతున్నప్పటికీ, అదే సమయంలో పశు సంవర్ధక రంగాన్ని వాణిజ్య సరళిలో అభివృద్ధి చేసుకునే అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. పాడి పశువులు, జీవాలు, నాటు కోళ్లు, పందుల పెంపకం వంటి రంగాల్లో యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విశాఖపట్నంలోని రాష్ట్ర పశుగణ యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల వ్యవస్థాపక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 1500 మంది శిక్షణ పొందగా, అందులో సుమారు 200 మంది రైతులు వాణిజ్యపరంగా లాభసాటిగా పశుసంవర్ధక కార్యకలాపాలను విజయవంతంగా ప్రారంభించినట్లు వెల్లడించారు. రైతులకు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన "పశుసంవర్ధక మార్గదర్శిని" ఈ-మేగజైన్‌ను ఏప్రిల్ నెల "స్మైల్" వెబ్‌సైట్‌తో పాటు రిలయన్స్ ఫౌండేషన్ వాట్సాప్ గ్రూపుల ద్వారా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ మేగజైన్‌లో పశు ఆరోగ్యం, పునరుత్పత్తి, పోషణ, యాజమాన్యం, మార్కెటింగ్, ప్రభుత్వ పథకాలు వంటి అంశాలపై సమగ్ర సమాచారం, విజయగాథలు, నిపుణుల సూచనలు, రైతుల సందేహాలకు సమాధానాలు అందించబడతాయని చెప్పారు. అలాగే, గ్రామీణ స్థాయిలో పనిచేస్తున్న పశుసంవర్ధక సహాయకులు, గోపాల మిత్రులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం చేరవేయడంలో కూడా ఈ-మేగజైన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. పశుసంవర్ధక రంగాన్ని సేంద్రియ, వాణిజ్య పద్ధతుల్లో అభివృద్ధి చేస్తే ఒక్క ఎకరం నుంచి సంవత్సరానికి రూ.5-6 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశముందని మంత్రి వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించినట్లుగా ప్రతి ఇంటిలో ఒక ఎంట్రప్రెన్యూర్ ఏర్పడి, వ్యక్తిగత అభివృద్ధితో పాటు రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పశుసంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ డా.వై. సింహాచలం, జాయింట్ డైరెక్టర్ డా. బైరాగి, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ఎఫ్.ఐ.ఆర్ కి ఛార్జ్ షీట్ మధ్య వ్యత్యాసం ఏమిటి...?




దేశంలో క్రిమినల్ న్యాయ వ్యవస్థలో ఎఫ్ఐఆర్ (ఎఫ్.ఐ. ఆర్) మరియు ఛార్జ్ షీట్ (ఛార్జ్ షీట్ ) కీలక దశలుగా నిలుస్తున్నాయి. నేరం జరిగిన వెంటనే ప్రారంభమయ్యే ఈ ప్రక్రియలు, చివరకు కోర్టు విచారణ దశకు ఎలా తీసుకెళ్తాయో తెలుసుకోవడం ప్రతి పౌరుడికి అవసరం అని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా కొత్త చట్టం భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బి.ఎన్.ఎస్.ఎస్) అమల్లోకి వచ్చిన తర్వాత సెక్షన్లలో మార్పులు చోటుచేసుకున్నాయి. నేరం జరిగిన వెంటనే పోలీసులకు అందిన సమాచారం ఆధారంగా నమోదు చేసే మొదటి అధికారిక పత్రం ఎఫ్ఐఆర్. పాత సి. ఆర్ పి.సి (క్రిమినల్ ప్రొసీజర్ కోడ్) లో ఇది సెక్షన్ 154 కింద ఉండేది. ప్రస్తుతం కొత్త చట్టం బి.ఎన్.ఎస్.ఎస్ సెక్షన్ 173 కింద ఎఫ్ఐఆర్ నమోదు జరుగుతోంది. ఇది గుర్తించదగిన నేరాల (కాగనిజబుల్ ఆఫెన్సెస్ ) విషయంలో మాత్రమే నమోదు చేయబడుతుంది. ఎఫ్ఐఆర్ ద్వారా పోలీసులు దర్యాప్తును ప్రారంభించే అధికారం పొందుతారు. ఈ దశలో పూర్తి ఆధారాలు అవసరం లేకపోయినా, నేరం జరిగినట్లు ప్రాథమిక సమాచారం ఉండటం సరిపోతుంది. దర్యాప్తు పూర్తయిన తర్వాత, నిందితుడిపై బలమైన ఆధారాలు ఉన్నాయని పోలీసులు నిర్ధారించినప్పుడు తయారు చేసే తుది నివేదిక ఛార్జ్ షీట్. పాత సీపీసీ సిఆర్.పి.సి సెక్షన్ 173(2) కింద దీనిని సమర్పించేవారు. కొత్త చట్టం ప్రకారం ఇది బి.ఎన్.ఎస్.ఎస్ సెక్షన్ 193 కింద వస్తుంది. ఛార్జ్ షీట్‌లో నేరానికి సంబంధించిన పూర్తి వివరాలు, సాక్షుల జాబితా, సాక్ష్యాలు, నిందితుడిపై పెట్టే అభియోగాలు సమగ్రంగా పొందుపరుస్తారు. ఈ పత్రాన్ని మేజిస్ట్రేట్‌కు సమర్పించిన తర్వాతే కోర్టులో విచారణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. అదే విధంగా, నిందితుడిని పోలీస్ కస్టడీలో ఉంచేందుకు సంబంధించిన రిమాండ్ ప్రక్రియ కూడా చట్టపరంగా కీలకం. పాత సిఆర్ పిసి సెక్షన్ 167 ప్రకారం రిమాండ్ రిపోర్ట్ ఫైల్ చేయబడేది. ప్రస్తుతం ఇది బి.ఎన్.ఎస్.ఎస్ సెక్షన్ 187 కింద అమలులో ఉంది. ఈ సెక్షన్ ప్రకారం, నిందితుడిని నిర్దిష్ట కాలం వరకు పోలీస్ లేదా జ్యుడీషియల్ కస్టడీలో ఉంచేందుకు కోర్టు అనుమతి అవసరం. సారాంశంగా, ఎఫ్ఐఆర్ (బి.ఎన్ఎస్ఎస్ 173) ద్వారా కేసు ప్రారంభమై, దర్యాప్తు అనంతరం ఛార్జ్ షీట్ (బి.ఎన్ఎస్ఎస్ 193) ద్వారా కోర్టులో బలపడుతుంది. మధ్యలో రిమాండ్ (బి.ఎన్ఎస్ఎస్ 187) వంటి ప్రక్రియలు నిందితుడి కస్టడీని నియంత్రిస్తాయి. ఈ మూడు దశలు కలిపి ఒక క్రిమినల్ కేసు ప్రారంభం నుండి విచారణ దశ వరకు తీసుకెళ్లే ప్రధాన చట్టపరమైన పునాదులు అవుతాయి.

**జె. కనక దుర్గ లక్ష్మీ**
**ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ (IHR)**
**ఉత్తరాంధ్ర ఇంచార్జి.**

# ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే ప్రశంస



**చింతలపూడి:( సిటిజన్ టైమ్స్) ఏప్రియల్ 30**

చింతలపూడి మండలంలో ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ క్యాంపు కార్యాలయం లో అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను కొనియాడుతూ, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని వారికి ప్రోత్సాహం అందించారు. కష్టపడి చదివితే విజయం తప్పకుండా సాధ్యమని, విద్యార్థులు తమ లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పదో తరగతి ఫలితాల్లో ఆదిత్య ప్రభంజనం

## 598 మార్కులతో ఇద్దరు విద్యార్థులకు రాష్ట్ర రెండో ర్యాంక్





**కాకినాడ (సిటిజన్ టైమ్స్), ఏప్రిల్ 30**

పదో తరగతి పరీక్ష ఫలితాలలో ఆదిత్య విద్యాసంస్థల పదో తరగతి విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు.598 మార్కులతో రాష్ట్ర స్థాయిలో విద్యార్థినీలు రెండో ర్యాంకులు సాధించారు. ఆదిత్య విద్యాసంస్థల పదవ తరగతి చదువుతున్న కే నిషిత మహాలక్ష్మి, పడవల శశి మేఘనలు ఈ ప్రతిభను దక్కించుకున్నారు. గురువారం కాకినాడ శ్రీనగర్ ఆదిత్య విద్యాసంస్థలో సంస్థ డైరెక్టర్ నల్లమిల్లి శృతిరెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. తమ పాఠశాల నుంచి 1480 పరీక్షలకు హాజరయ్యారని వారిలో 90 శాతం పైగా ఉత్తీర్ణత సాధించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 89 మందికి విద్యార్థులకు 590 పైగా మార్కులు సాధించినట్లు చెప్పారు. 826 మంది 550పైగా మార్కులు, 1213 మంది 500పైగా మార్కులు సాధించినట్లు ఆమె చెప్పారు. తెలుగులో 180 మంది, లెక్కలులో 272 మంది, సైన్స్లో 138 మంది, సోషల్లో 180 మంది విద్యార్థులు నూటికి నూరు శాతం మార్కులు సాధించినట్లు ఆమె చెప్పారు. ఆదిత్య విద్యాసంస్థల ఫలితాలలో విద్యార్థుల ఉత్తీర్ణతకు ఎంతగానో కృషి చేసిన ఉపాధ్యాయులను శృతి రెడ్డి అభినందించారు. ఈ సమావేశంలో కోఆర్డినేటర్ వి రాజేష్, శ్రీనగర్ బ్రాంచ్ ప్రిన్సిపల్ టి రమేష్, పిఠాపురం ప్రిన్సిపల్ విజయ సారథి, ఐఐటి ప్రిన్సిపల్ మొయినా తదితరులు పాల్గొన్నారు.

# అనకాపల్లి పోలీసు శాఖలో రిటైర్డ్ అధికారులకు ఘన వీడ్కోలు







**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :30**

పోలీసు శాఖలో దశాబ్దాల పాటు నిబద్ధతతో సేవలు అందించి పదవీ విరమణ పొందిన అధికారులకు అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఆత్మీయ సభలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా చేతుల మీదుగా రిటైర్డ్ అధికారులను సత్కరించారు. పదవీ విరమణ పొందిన వారిలో గనివాడ విశ్వనాథం (ఎస్‌బి అనకాపల్లి) 42 సంవత్సరాలు, జక్కుల నాగేశ్వరరావు (అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్) 39 సంవత్సరాలు, పి. సత్యనారాయణ (డీసీఆర్‌బీ అనకాపల్లి) 37 సంవత్సరాలు, ఈత వెంకటకృష్ణ మునేశ్వరరావు (ఏఆర్ అనకాపల్లి) 42 సంవత్సరాలు, జంపరంగి విశ్వనాథం (ఏఆర్ అనకాపల్లి) 41 సంవత్సరాలు, బయవరపు పెంటయ్య (పోలీస్ యూనిట్ బార్బర్, ఏఆర్ అనకాపల్లి) 42 సంవత్సరాల పాటు సేవలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు ఎస్పీ ఎల్. మోహనరావు హాజరై, ఎస్‌బి డీఎస్పీ మోహనరావు, డీసీఆర్‌బీ సీఐ లక్ష్మణరావు, సీఐ బాలసూర్యరావు, సీఐ లక్ష్మి తదితరులతో కలిసి రిటైర్డ్ సిబ్బందిని వారి కుటుంబ సభ్యుల సమక్షంలో శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, పోలీసు వృత్తి అత్యంత ఒత్తిడితో కూడుకున్నదని, అలాంటి రంగంలో దశాబ్దాల పాటు క్రమశిక్షణతో సేవలు అందించడం సాధారణ విషయం కాదని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లు, ఆర్మ్డ్ రిజర్వ్ విధులు, బందోబస్తు నిర్వహణలో వీరు అందించిన సేవలు శాఖకు గర్వకారణమని తెలిపారు. రిటైర్డ్ అధికారులు తమ అనుభవాలను పంచుకుంటూ, పోలీసు ఉద్యోగం తమకు సమాజంలో గౌరవాన్ని తీసుకువచ్చిందని, సేవ పూర్తి చేసి పదవీ విరమణ పొందడం ఆనందంగా ఉందని భావోద్వేగంగా చెప్పారు. జిల్లా ఎస్పీతో పాటు ఉన్నతాధికారులు రిటైర్డ్ సిబ్బంది విశ్రాంత జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షిస్తూ, భవిష్యత్తులో కూడా పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఆర్ఐ వెల్ఫేర్ రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ అప్పలరాజు తదితర సిబ్బంది పాల్గొని రిటైర్డ్ అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

# గిరిజన గ్రామాల్లో రోడ్లు వెంటనే పూర్తి చేయాలి

### ఎమ్మెల్సీ డా. కుంభా రవిబాబు



**అల్లూరి జిల్లా, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :30**

గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్సీ డా. కుంభా రవిబాబు, సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వలన గుత్తేదారులు రోడ్ల నిర్మాణ పనులను మధ్యలో వదిలేసినట్లు వెల్లడించారు. దీంతో గిరిజనులు తీవ్రమైన రవాణా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గురువారం మీడియాతో మాట్లాడుతూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అనేక గిరిజన గ్రామాల్లో రోడ్లు లేకపోవడంతో, అత్యవసర పరిస్థితుల్లో కూడా ప్రజలు ప్రాణాపాయ స్థితిని ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారిని ఆసుపత్రులకు తరలించడానికి డోలీలను ఆశ్రయించాల్సి వస్తున్న దుర్భర పరిస్థితులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఈ దయనీయ పరిస్థితులకు పూర్తి బాధ్యత ప్రభుత్వమే నడిపించిందని, సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే బకాయి బిల్లులను చెల్లించి, నిలిచిపోయిన రోడ్ల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. రోడ్లు పూర్తయితే, మారుమూల గిరిజన గ్రామాలకు వైద్య సేవలు, విద్య, రవాణా సౌకర్యాలు సులభంగా చేరుతాయని, గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఎమ్మెల్సీ డా. కుంభా రవిబాబు స్పష్టం చేశారు.

# జిల్లాలో 16 బాయిల్డ్ మిల్లులు

### జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నిధియా దేవి




**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 30**

బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పండే బాయిల్డ్ వెరైటీస్ అయిన ఎంటియు 3626 ఎం సి 13 పండించే రైతులు ఏ విధమైన ఆందోళన చెందనవసరం లేదని, విభజనలో మండపేట మన జిల్లా నుంచి వెళ్లిపోయిన,మన జిల్లాలో పండే మొత్తం 1,79, 940 ఎంపీస్ ధాన్యాన్ని ఆడించడానికి సరిపోయినన్ని మిల్లులు అనగా 16 బాయిల్డ్ మిల్సుకు జిల్లా పరిధిలో ఉన్నాయని ,వీరందరూ కూడా ప్రభుత్వానికి సరియైన బ్యాంకు గ్యారంటీలు చెల్లించారని, కాబట్టి రైతులెవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జాయింట్ కలెక్టర్ వైకోమ్ నిడియాదేవి తెలియజేశారు. ఇంతవరకు 49 కోట్ల బ్యాంకు గ్యారంటీ చెల్లించారు కాబట్టి ఏ విధమైన ఇబ్బంది ఉండదని తెలియజేశారు. రైతులు ముఖ్యంగా గంగవరం రామచంద్రాపురం మండలాల్లోనే ఈ వెరైటీలు పండిస్తారు .కాబట్టి గతంలో వీరికి మండపేట కి ధాన్యం పంపే అలవాటున్నప్పటికీ ఇప్పుడు మన జిల్లా పరిధిలోకి రావు, కాబట్టి రావులపాలెం, ఆలమూరు కే.గంగవరం, రామచంద్రపురం మండలాల్లోని మిల్లర్లకే పంపాలని తెలియజేశారు. ఒక వేళ దూరం కొద్దిగా పెరిగిన ట్రాన్స్పోర్ట్ చార్జీలు పూర్తిగా ప్రభుత్వమే భరిస్తాది, కాబట్టి రైతులకు ఏ విధమైన ఇబ్బంది లేదని, ఈ మిల్లులన్నిటిలో తగినన్ని గోనే సంచులు ఉన్నాయని, రవాణా సదుపాయాలు కూడా కల్పిస్తామని జాయింట్ కలెక్టర్ తెలియజేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు జిల్లా మేనేజర్ పౌర సరఫరాల వారు జిల్లా పౌరసరఫరాల అధికారి వారు నిశితంగా పరిశీలిస్తున్నారని రైస్ మిల్లుల సంఘం అధ్యక్షులు దేశం శెట్టి లక్ష్మీనారాయణ 15 రోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

# విశాఖలో బీసీ డెడికేటెడ్ కమిషన్ తొలి పర్యటన

### పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 30**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై అధ్యయనం కోసం, సుప్రీం కోర్టు మార్గదర్శకాల మేరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య డెడికేటెడ్ కమిషన్ తొలిసారిగా విశాఖపట్నం జిల్లాలో పర్యటించింది. కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని బృందం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్‌తో కలిసి సమావేశమై, అధికారులతో పాటు బీసీ సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపింది. ఈ సందర్భంగా వివిధ సంఘాల ప్రతినిధుల నుంచి వినతులు స్వీకరించి, వారి అభిప్రాయాలు, సమస్యలను నమోదు చేసింది. సమావేశంలో బీసీ సంఘాల ప్రతినిధులు పలు కీలక అంశాలను కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. బట్రాజు వర్గానికి రాజకీయ అవకాశాలు కల్పించాలని, నాయీ బ్రాహ్మణులను సామాజికంగా అవమానించే పరిస్థితులను నివారించడంతో పాటు ఎస్సీ జాబితాలో చేర్చాలని విజ్ఞప్తులు చేశారు. విశాఖపట్నం కార్పొరేషన్ ఎన్నికల్లో కనీసం ఐదు వార్డుల్లో ప్రాతినిధ్యం కల్పించాలని కళింగ వర్గం కోరగా, బీసీ-డీ వర్గంలో ఉన్న తమను బీసీ-ఏ జాబితాలో చేర్చాలని నాగవంశం ప్రతినిధులు అభ్యర్థించారు. విశ్వబ్రాహ్మణ, కళింగ వైశ్య సంఘాల ప్రతినిధులు కూడా వర్గీకరణ మార్పులు, రాజకీయ ప్రాధాన్యతపై తమ డిమాండ్లు వెల్లడించారు. అదేవిధంగా, సంప్రదాయ వృత్తులకు గౌరవం కల్పించడంతో పాటు దేవాలయాల్లో వాయిద్యాలు వాయించే అవకాశాలు ఇవ్వాలని కూడా కొన్ని సంఘాలు కోరాయి. వినతుల స్వీకరణ అనంతరం కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా అధికారులకు కీలక సూచనలు చేశారు. పంచాయతీరాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలో బీసీ వర్గాలకు సంబంధించిన డేటా సేకరణ, మ్యాపింగ్ ఖచ్చితంగా నిర్వహించాలని, ఎలాంటి తారతమ్యాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సెన్సస్ ప్రక్రియలో కూడా బీసీ వర్గాల వివరాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డుల సర్వేలను సమీక్షిస్తూ సంబంధిత విభాగాలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. గత ఎన్నికల్లో బీసీ వర్గాల నుంచి ఎన్నికైన ప్రతినిధుల వివరాలను సేకరించాలని కూడా సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అదనపు డైరెక్టర్ చంద్రశేఖర్, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు చెందిన అధికారులు, బీసీ వెల్ఫేర్ సిబ్బంది పాల్గొన్నారు.

# 10లో కాకినాడ జిల్లాకు 14వ స్థానం

### మే 25 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు



**కాకినాడ (సిటిజన్ టైమ్స్)ఏప్రిల్ 30**

రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన 10వ తరగతి పరీక్షల ఉత్తీర్ణతలో కాకినాడ జిల్లాకు 14వ స్థానం లభించింది. ఉత్తీర్ణత కానీ విద్యార్థుల కోసం మే 25 నుంచి జూన్ 4వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కాకినాడ జిల్లా విద్యాశాఖ అధికారి (డిఈఓ) పి రమేష్ తెలిపారు. 10వ తరగతి పరీక్షల ఫలితాలు రాష్ట్రవ్యాప్తంగా గురువారం విడుదల చేశారు. దీనికి సంబంధించిన వివరాలను డీఈఓ రమేష్ తన కార్యాలయంలో విలేఖర్లతో వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కాకినాడ జిల్లా నుండి పదవ తరగతి పరీక్షలకు నిమిత్తం 28 వేల 289 మంది హాజరు కాగా 24 వేల 347 మంది 86.08 శాతంతో ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. వీరిలో బాలురు 11,738 మంది బాలికలు 12, 609 మంది ఉన్నారని చెప్పారు. ఉత్తీర్ణత కాని విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలను మే 20వ తేదీ నుండి జూన్ 4 వరకు నిర్వహించనున్నట్లు డిఈవో చెప్పారు. ఆ విద్యార్థుల ఇళ్లకు తమ ఉపాధ్యాయులు వెళ్లి వారి తల్లిదండ్రుల ఆర్థిక, స్థితిగతులను తెలుసుకొని మరలా పరీక్ష రాయించేందుకు ఉత్తీర్ణత అయ్యే విధంగా తగు శిక్షణ ఇస్తామని రమేష్ పేర్కొన్నారు. అలాగే 24 వేల 347 మంది ఉత్తీర్ణతతో కాకినాడ జిల్లాకు ఏడో స్థానం దక్కిందన్నారు. గత ఏడాది కాకినాడ జిల్లాకు 80.24 శాతంతో 15వ స్థానం లభించగా ఈ సారి మరింత మెరుగు కావడం ఆనందం కలిగించిందని డిఈఓ రమేష్ తన అభిప్రాయంను వ్యక్తం చేశారు.

# మంచినీళ్లు ఇవ్వాలి...

## నినాదాలతో మార్మోగిన గర్నికం గ్రామం

**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 30**

అనకాపల్లి జిల్లా రావికమ్మతం మండలం గర్నికం గ్రామంలోని దళిత కాలనీలో నెలకొన్న మంచినీటి కొరతపై స్థానికులు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. సుమారు 30 కుటుంబాలు నివసిస్తున్న ఈ కాలనీలో తాగునీటి సమస్య నెలలుగా కొనసాగుతోంది. ఏప్రిల్ 1న దళితులు నీటి కోసం ఆందోళన చేపట్టగా స్పందించిన అధికారులు రెండు బోర్లను మరమ్మతు చేయడంతో పాటు ఒక కులాయిని అత్యవసరంగా ఏర్పాటు చేశారు. అయితే ఆ కులాయిలో ఒక్కరోజే నీరు వచ్చి తర్వాత సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో సమస్య మళ్లీ తీవ్రతరమైంది. దీంతో కాలనీలో ప్రత్యేకంగా నీటి ట్యాంక్ నిర్మించి, నిరంతర మంచినీటి సరఫరా కల్పించాలని డిమాండ్ చేస్తూ గ్రామంలో డబ్బులతో ఊరేగింపు నిర్వహించారు. నీరు రాని కులాయికి పూలదండలు వేసి నిరసన తెలియజేస్తూ, డప్పులతో శబ్దాలు చేస్తూ "మంచినీళ్లు ఇవ్వాలి" అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ గర్నికంతో పాటు కొత్తకోట అంబేద్కర్ దళిత కాలనీలో కూడా నీటి సమస్య తీవ్రంగా ఉందని, దళితులు ఇతర వర్గాల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకునే పరిస్థితి ఏర్పడటం విచారకరమన్నారు. ప్రతి దళిత కాలనీలో ప్రత్యేక నీటి ట్యాంకులు ఏర్పాటు చేసి సమగ్రంగా సరఫరా చేయాలని, జిల్లా కలెక్టర్ స్వయంగా గ్రామాలను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే ప్రతి నెల పౌర హక్కుల దినం సందర్భంగా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ గ్రామాల్లో పర్యటించి సమస్యలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే దళితుల పక్షాన సీపీఎం పోరాటాలను ఉద్ధృతం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే. గోవిందరావు, కులవ్యవస్థ వ్యతిరేక పోరాట కమిటీ నాయకుడు చెవేటి సూరిబాబు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# గంగానాపల్లిలో ఘనంగా అభయాంజనేయ స్వామి, దుర్గామాత విగ్రహ ప్రతిష్ట

### వేద మంత్రోచ్చారణల మధ్య వైభవోపేతంగా

### పూజలు, హోమాలు: భారీ అన్నదానం



**కాకినాడ(సిటిజన్ టైమ్స్)ఏప్రిల్ 30**

గంగానాపల్లి గ్రామంలో స్కూల్ బిల్డింగ్ ఎదురుగా శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీ దుర్గామాత, శ్రీ విఘ్నేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం అతి వైభవంగా నిర్వహించారు.గ్రామ వార్డ్ మెంబర్, జనసేన సీనియర్ నాయకులు తడాల వెంకటరత్నం (అబ్బు) ఆధ్వర్యంలో, గ్రామ ప్రజల సహకారంతో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి, శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం వైభవోపేతంగా ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగు శ్రీనివాసరావు, జనసేన పార్టీ అధ్యక్షులు కర్రీ నాగబాబు, కోడూరు భాస్కరరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కొమ్మన తాతారావు, గ్రామ ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి, అన్నదానంలో పాల్గొన్నారు.

# ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పల్లా శ్రీనివాసరావు అభినందనలు

**గాజువాక, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :30**



పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరగడం పట్ల టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెరగడం విద్యా రంగంలో జరిగిన పురోగతికి నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. "ఉత్తీర్ణత సాధించిన ప్రతి విద్యార్థి గొప్ప కృషిని ప్రదర్శించారని, ఇది వారి పట్టుదల, శ్రమ ఫలితమని" పల్లా అన్నారు. అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న విద్యా రంగంలో ముఖ్యంగా నారా లోకేష్ అమలు చేసిన 100 రోజుల ప్రణాళిక, ప్రభుత్వం తీసుకున్న చర్యలతో క్రమక్రమంగా గుణాత్మక మార్పులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. "ఈ మార్పులు ప్రభుత్వ పాఠశాలల్లో స్ఫూర్తిదాయకమైన ఫలితాలను చూపిస్తున్నాయి. బాలికలు ముందుండడం, మెరుగైన ఫలితాలు సాధించడం శుభపరిణామంగా ఉంది. ఇది ప్రతి కుటుంబం, ప్రతి సమాజానికి శక్తివంతమైన సంకేతం," అని పల్లా అన్నారు. లోకేష్ దార్శనికత, పక్కా ప్రణాళికతో ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలపరచడంలో గొప్ప ప్రగతిని సాధించామని ఆయన అభినందించారు. "విద్యార్థుల భవిష్యత్తుకు ఈ ప్రణాళిక మేజర్ అడ్వాంటేజీలు అందించబోతుంది. లోకేష్ చేస్తున్న ఈ ప్రయాణం, దీర్ఘకాలికంగా విద్యా రంగానికి పునాది వేస్తోంది," అని పల్లా శ్రీనివాసరావు విశ్వసించారు.

# పారిశుధ్యం సాధించడంలో భాగస్వామ్యం కావాలి

### నగర పంచాయతీ కమిషనర్ రవివర్మ

ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 30 :నగర పంచాయతి పరిధిలో స్వచ్ఛ సర్వేక్షన్ లో భాగంగా కమిషనర్ పి.రవి వర్మ ప్రత్యేక పారిశుధ్యం పై నెల రోజులుగా దృష్టి సారించారు .అందుకు సంబంధించి ,శ్రీ బాలాజీ విద్యా సంస్థ వారు 13 బిన్నులు, వైదిన్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం వారు 3 బిన్నులు, మరియా మాంటిస్సోరి విద్యా సంస్థ వారు 3 బిన్నులు నగర పంచాయతి కమిషనర్ వారికి అందజేసినారు.ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పారి శుధ్యం మెరుగుపరిచేందుకు సహకరిస్తున్న దాతలందరికీ కృతజ్ఞతలు తెలియజేసినారు. ఇంకనూ పట్టణంలో గల ప్రముఖులు,సంస్థలవారు, ప్రజలు సహకరించి, స్వచ్ఛ ముమ్మిడివరం సాధించడంలో కీలక భాగస్వామ్యం కావాలని కోరారు.



## గ్రామపంచాయతీ కార్మికుల జీతాలు పెంచాలని, పిఎఫ్, ఈఎస్ఐ లు అమలు చేయాలని డి పి ఓ కు యూనియన్ వినతి పత్రం



**కాకినాడ (సిటిజన్ టైమ్స్) ఏప్రిల్ 30**

ఎ పి గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ( సిఐటియు ) ప్రతినిధి వర్గం జడ్పీ సీ ఈ వో మరియూ ఇన్చార్జ్ డి పి ఓ వి వి యస్ లక్ష్మణరావును కలిసి కార్మికుల సమస్యలపై వినతి పత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పి వీరభద్రం,సి హెచ్ అజయ్ కుమార్లు మాట్లాడుతూ పెరిగే ధరలతో పంచాయతీ కార్మికులకు ఇచ్చే జీతాలు ఏమాత్రం సరిపోవడం లేదని జీతాలు పెంచాలని, చాలా పంచాయతీలు అమలు చేయని పి ఎఫ్ , ఈ ఎస్ ఐ లు అమలు చేయించాలని, 2026 మార్చి, ఏప్రిల్ రెండు నెలల బకాయి జీతాలు చెల్లించాలని వారు కోరారు. పని రెన్యువల్ విషయంలో ప్రస్తుతం పని చేస్తున్న వారందరినీ కొనసాగించాలని, టెండరింగ్ విధానం రద్దు చేయాలని గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఈసందర్భంగా వారు గుర్తు చేశారు. ప్రభుత్వ సెలవులను తూచా తప్పకుండా అమలు చేయాలని వారు కోరారు. ఈసందర్భంగా ఇన్చార్జి డి పిఓ వివిఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ తమ పరిధిలో ఉన్న పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారంపై అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరిస్తామని, రాష్ట్ర బడ్జెట్ కు సంబంధించిన అంశాలను ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. యూనియన్ నాయకులకు ఆయన హామీ ఇచ్చారు. డి పి ఓ ను కలిసిన వారిలో వాసంశెట్టి చంద్రరావు, మోర్త అప్పారావు, కాదా నూకరాజు, పల్లా వీరబాబు, పల్లా ప్రకాష్ రావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థినికి, ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే ప్రశంస




**లింగపాలెం సిటిజన్ టైమ్స్ ఏప్రియల్ : 30**

ఏలూరు జిల్లా లింగపాలెం మండలంలో రంగాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన లింగపాలెం మండలం వేములపల్లి గ్రామానికి చెందిన కనిపెడ వంశిక కు 600 మార్కులకు గాను 576 మార్కులతో లింగపాలెం మండలంలో ప్రభుత్వ పాఠశాల స్థాయిలో మొదటి స్థానం సాధించిన సందర్బంగా శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ క్యాంపు కార్యాలయం లో అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను కొనియాడుతూ, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని తెలిపారు. కష్టపడి చదివితే విజయం తప్పకుండా సాధ్యమని, విద్యార్థులు తమ లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లింగపాలెం మండల విద్యాశాఖ అధికారి జె. రవీంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి వెంకటరత్నం, పాపా తండ్రి సువర్ణరాజు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు కృష్ణా జిల్లాలో కట్టుదిట్టమైన భద్రత

**కృష్ణా జిల్లా, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :30**

మే 1న కృష్ణా జిల్లా పమిడిముక్కలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, ఏలూరు రేంజ్ ఐజీపీ జి.వి.జి అశోక్ కుమార్ కలిసి పరిశీలించారు. పర్యటనకు సంబంధించిన హెలిపాడ్, సభా ప్రాంగణాలు, ముఖ్య ప్రాంతాలు, రహదారులు మరియు కీలక బందోబస్తు పాయింట్లను సందర్శించి ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. సిబ్బందితో ప్రత్యక్షంగా మాట్లాడి విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిర్వహణను సమర్థంగా నిర్వహించాలని, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రతి బందోబస్తు పాయింట్ వద్ద బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా, సాఫీగా జరిగేలా జిల్లా పోలీసు శాఖ పూర్తి స్థాయిలో ఏర్పాట్లు అమలు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.



# ఎండల తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలి....

**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 30**

ప్రస్తుతం పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సఖినేటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది కోరారు. గురువారం మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించి, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. సఖినేటిపల్లి మండల రెవెన్యూ కార్యాలయం, మండల విద్యాశాఖ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ఎంపీడీవో కార్యాలయాలను సందర్శించి అధికారులకు, సిబ్బందికి ఓఆర్ఎస్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగవద్దని, ఓఆర్ఎస్ వినియోగం వలన శరీరంలో నీటి శాతం తగ్గి నీరస పడినప్పుడు వెంటనే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలి కోరారు. మండలంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సచివాలయాల్లో 'ఓఆర్ఎస్ కార్నర్స్' ఏర్పాటు చేయడం జరిగింది. ప్రజలు వీటిని సద్వినియోగం



చేసుకోవాలి. లక్షణాలు, విపరీతమైన దాహం, తలతిరగడం, వాంతులు కావడం వంటి వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలి అని తెలిరాజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వీరా మల్లికార్జున రావు, మండల



రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారి కిషోర్, సిహెచ్. లలిత, పి హెచ్ ఎన్, హెల్త్ అసిస్టెంట్ ఎం. కనకరాజు, ఏఎన్ఎంలు డి. కనకదుర్గ, ఎన్. నీలిమ, జె కవిత, ముత్యాలమ్మ, లక్ష్మీ కుమారి, సిబ్బంది పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.

# హత్య కేసులో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు శిక్ష :జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి




**శ్రీకాకుళం,సిటిజన్ టైమ్స్, ఏప్రిల్:30**

మందస పోలీస్ స్టేషన్ లో నమోదైన హత్య కేసులో ఇద్దరు నిందితులకు సోంపేట 6వ అదనపు జిల్లా కోర్టు వారు జీవిత ఖైదు శిక్ష విధించింది అని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. కేసు వివరాలకు వస్తే, ఫిర్యాది తిలోత్తమ శెట్టి (37 సంవత్సరాలు), గౌడ గురండి గ్రామం, మందస మండలం నివాసి, తన భర్త ఆనంద్ శెట్టి (45 సంవత్సరాలు), పత్రపురం గ్రామం, గంజాం జిల్లా, ఒడిశా రాష్ట్రానికి చెందినవారిని సుమారు 14 సంవత్సరాల క్రితం రెండవ భార్యగా వివాహం చేసుకున్నారు.కొంతకాలం హైదరాబాద్‌లో నివసించిన అనంతరం తమ స్వగ్రామమైన గౌడ గురండి గ్రామానికి వచ్చి నివసిస్తున్నారు.ఈ సమయంలో మృతుడికి నిందితులు ఎ1 కొండా రమేష్, ఎ 2 భువనేశ్వర్ బెహరా, భువన్ బొబ్బి లతో పరిచయం ఏర్పడింది. వారు తరచూ కలిసి మద్యం సేవించేవారు.అయితే, మృతుడు ఇల్లరికం వచ్చాడని నిందితులు గ్రామంలో హేళనగా ప్రచారం చేయడంతో వివాదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో 27.07. 2022న మృతుడు నిందితులను ప్రశ్నించగా గొడవ జరిగింది.దీనిని మనసులో పెట్టుకున్న నిందితులు 30.07.2022న మృతుడిని స్కూటీపై తీసుకెళ్లి,కులాడి గ్రామం దాటి వెళ్లిన తరువాత గొడవకు దారితీసి, టవల్‌తో గొంతు బిగించి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటనపై మందస పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.94/2022 యు/ఎస్ 302 ఆర్/డబ్ల్యూ 34 ఐపీసీ కింద కేసు నమోదు చేయబడింది.అప్పటి ఎస్ఐ వై. మధుసూధన రావు కేసు నమోదు చేయగా, సి.ఐలు ఎస్. శంకరరావు మరియు డి. రాము సమగ్ర దర్యాప్తు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. అనంతరం సి.ఐ జి. శంకరరావు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దువ్వ జగన్నాయకులు గారు సమర్థవంతంగా వాదనలు వినిపించగా, నిందితులపై నేరం రుజువైంది. దీంతో 6వ అదనపు జిల్లా జడ్జి, సోంపేట కోడూరు కిశోర్ బాబు గురువారం (30.04.2026) తీర్పు వెలువరించి, నిందితులు ఎ1 కొండా రమేష్, ఎ2 భువనేశ్వర్ బెహరా, భువన్ బొబ్బి లకు జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.1,000/- జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 3 నెలల సాధారణ జైలు శిక్ష విధించారులి. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసి, నిందితులకు శిక్షించబడే విధంగా సమర్థవంతంగా పని చేసిన కేసు దర్యాప్తు అధికారులు, కాశీబుగ్గ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుపతి రావు, మందస ఎస్ఐ కృష్ణ ప్రసాద్ సి.ఎం.ఎస్. ఎస్ఐ సురేష్, కోర్టు కానిస్టేబులు సురేష్ కుమార్ జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# 10వ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా ద్వితీయ స్థానం

### రాష్ట్రంలో ద్వితీయ స్థానం సాధించడం గర్వకారణం

### జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 30**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ విజయానికి ప్రధాన కారణం జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రుల సమిష్టి కృషి అని పేర్కొన్నారు. జిల్లా విద్యా అధికారి ఆధ్వర్యంలో పాఠశాలల్లో నాణ్యమైన బోధన, ప్రత్యేక శ్రద్ధ,పునశ్చరణ తరగతులు, పరీక్షల పట్ల అవగాహన కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని కలెక్టర్ అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ మంచి ఫలితాలు సాధించారని,ఉపాధ్యాయులు చూపిన అంకితభావం ప్రశంసనీయం అని పేర్కొన్నారు. భవిష్యత్తులో జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించేలా మరింత కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, వారికి




మార్గదర్శకులైన ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ ,జిల్లా విద్యాశాఖ అధికారులు అభినందనలు తెలిపారు.

# సిటిజన్ టైమ్స్ కథనానికి స్పందన




బుధవారం 29 ఏప్రిల్ 2026
నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిబంధనలకు తిలోదకాలు
రోడ్డును ఆక్రమించిన అపోలో ఫార్మసీ!




**సిటిజన్ టైమ్స్**
**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 30**

స్పందించిన మున్సిపల్ కమిషనర్.. తొలగించిన ఏసీ ఔటర్స్! నాగర్ కర్నూల్ పట్టణ కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా రోడ్డును ఆక్రమిస్తూ ఏర్పాటు చేసిన అపోలో ఫార్మసీ ఏసీ ఔటర్లను మున్సిపల్ అధికారులు పర్యవేక్షణలో తొలగించారు. దీనిపై గతంలో వచ్చిన వార్తలకు మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

CITIZEN TIMES
ఎఫెక్ట్
TELUGU DAILY

**ప్రజల హర్షం:** పాదచారులకు ఇబ్బందిగా మారిన ఈ ఆక్రమణను వెంటనే తొలగించి, మార్గాన్ని సుగమం చేసినందుకు నాగర్ కర్నూల్ ప్రజలు మున్సిపల్ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ "శాబాష్ మున్సిపల్ కమిషనర్" అంటూ ప్రజలు కొనియాడుతున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీసు అధికారులు

### ఘనంగా సత్కరించిన జిల్లా ఎస్పీ




**కాకినాడ(సిటిజన్ టైమ్స్)ఏప్రిల్ 30:**

పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు విశిష్ట సేవలు అందించి, నేడు పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. పదవీ విరమణ పొందిన వారిలో మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై కె. సత్యనారాయణ, ఇంద్రపాలెం ఎస్సై జి.వి.బి.వి. ప్రసాద్ మరియు కాకినాడ ఆర్మ్డ్ రిజర్వ్ ఏఆర్ ఎస్సై వి.జె. మోహన్ ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయా అధికారులను దుశ్శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించి, వారి సుదీర్ఘ సేవలను కొనియాడారు. విధి నిర్వహణలో వారు చూపిన నిబద్ధతను అభినందిస్తూ, వారి తదుపరి విశ్రాంత జీవనం సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.వి.వి. సత్యనారాయణ మూర్తి, ఎస్పీ సీసీ కె. రాంబాబు, జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి. సత్యమూర్తి, ఆర్.ఐలు ఎం. నరసింహమూర్తి, కె. వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## రంగాపురంలో తిరు కళ్యాణ మహోత్సవం

**లింగపాలెం సిటిజన్ టైమ్స్ ఏప్రియల్ : 30**

ఏలూరు జిల్లా లింగపాలెం మండలం లో రంగాపురం గ్రామంలో రెండు అన్నవరంగా ప్రసిద్ధిగాంచిన, శ్రీ భూనీలా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో, ఈరోజు స్వామివారి తిరు కళ్యాణ మహోత్సవంలో భాగంగా స్వామివారి, రథోత్సవం మరియు స్వామివారి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం, నిర్వహించడం జరిగింది. ఈ తిరు కళ్యాణ మహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. మేళ తాళాలతో అంగరంగ వైభవంగా శ్రీ స్వామివారి కళ్యాణ మహోత్సవం జరిగింది.





# వైభవంగా శ్రీ లక్ష్మీ నృసింహుని జయంతి....







**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 30:**
డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో శ్రీ లక్ష్మీ నృసింహుని జయంతిని వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు పి శ్రీనివాసకిరణ్ ఆధ్వర్యములో మాలాధారణ స్వాములచే విశేష పూజలు, మహా శాంతి హోమం జరిపినట్లు, ఈ సందర్భంగా నక్షత్ర మాలాధారణ పూర్తి అయినట్లు, సుమారు 150 స్వాములకు అర్చక స్వాములు చే వేధోతంగా మాల విసర్జన చేసినట్లు అసిస్టెంట్ కమిషనర్ మోకా నాగవర ప్రసాదు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానాచార్యులు రామ రంగాచారి, రాజేష్చార్యులు, మాధవ, పిల్లయాచార్యులు, కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## డీఈఓ కు అభినందనలు తెలియజేసిన ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నేతలు



**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఏప్రిల్ 30**
పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే నాగర్కర్నూల్ జిల్లా ద్వితీయ స్థానంలో నిలవడంలో విశేష కృషి చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ గారిని జిల్లా ఉపాధ్యాయ జేఏసీ సన్మానించి అభినందనలు తెలియజేయడం జరిగింది. రమేష్ కుమార్ నాగర్ కర్నూల్ విద్యా శాఖను నిరంతరం అంకిత భావంతో పర్యావేక్షించడం, అట్లాగే ఉపాధ్యాయులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ఉత్తమ బోధన జరిగేటట్టుగా చర్యలు తీసుకోవడం జరిగింది. ఉదయము సాయంత్రము ప్రత్యేక తరగతులు నిర్వహించడమే కాకుండా వారాంతపు, మాసాంతపు పరీక్షలు, రెండు గ్రాండ్ టెస్టులు నిర్వహించి ఫలితాలను సమీక్షించి వెనకబడిన విద్యార్థులకు తగు సూచనలు ఇవ్వడం వల్లనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని జేఏసీ అధ్యక్షులు డి సత్యనారాయణ రెడ్డి, జేఏసీ కార్యదర్శి శ్రీధర్, కార్యనిర్వహక కార్యదర్శి విజయ్ కుమార్ లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, సహకరించిన తల్లిదండ్రులకు, పాఠశాల ప్రధానోపాధ్యాయులకు,ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. వచ్చే విద్యా సంవత్సరంలో కూడా ఇట్లాగే కష్టపడి పనిచేసి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో చైర్మన్ గుడిపల్లి నిరంజన్, జిహెచ్ఎం వెంకటరమణ, వెంకటయ్య, రవీందర్, సాయి రెడ్డి, జిహెచ్ఎం తిరుపతయ్య, బాలు ,సామ రమేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటడం అభినందనీయం...

*పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు....*

కొత్తపేట సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 30 :కూటమి ప్రభుత్వం తీసుకున్న మెరుగైన చర్యలతో గురువారం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తా చూపారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆనందం వ్యక్తం చేశారు. పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపి రాణించిన విద్యార్థులందరినీ ఆయన అభినందించారు. నియోజకవర్గంలో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన ఆలమూరు మండలం బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని వి గాయత్రి (592), కొత్తపేట మండలం వానపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె త్రిమూర్తులు రమ్య(588), తొత్తుపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి మౌనిక (584), ఆత్రేయపురం మండలం మహాత్మా గాంధీ ఎయిడెడ్ హై స్కూల్ విద్యార్థిని కె శైలు (584)లను ప్రత్యేకంగా అభినందించారు.వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద తనను కలిసిన వానపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె త్రిమూర్తులు రమ్యను ఆశీర్వదించి, ఆమెను సత్కరించి స్వీట్ బాక్స్ అందజేసి శుభాకాంక్షలు తెలియజేసారు.ఉపాధ్యాయులకు సైతం శుభాకాంక్షలు తెలియజేసారు.



## యువత మత్తు వీడి బంగారు భవిష్యత్తు వైపు అడుగులు వేయాలి: కలెక్టర్ విజయ కృష్ణన్





**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :30**
డ్రగ్స్ మరియు గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండి, తమ భవిష్యత్తును నిర్మించుకునే దిశగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి నిర్వహించిన నార్కో కోఆర్డినేషన్ సెంటర్ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మరియు వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డ్రగ్స్ మరియు గంజాయి సమస్యను అరికట్టడంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అనకాపల్లి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడం లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి సమస్య అనేక సామాజిక సమస్యలకు మూలకారణంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు వ్యసనాల నుండి బయటపడేందుకు డీ–అడిక్షన్ సెంటర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులను 'క్యాంపస్ అంబాసిడర్లుగా' తీర్చిదిద్దాలని, తోటి విద్యార్థుల్లో అవగాహన పెంచాలని పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్‌లను ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని, రైల్వే స్టేషన్లు, రైళ్లు, బస్టాండ్లు, బస్సుల్లో నిరంతరం గస్తీ నిర్వహించాలని పోలీస్, ఎక్సైజ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డ్రగ్స్, గంజాయి పై అవగాహన కల్పించే పోస్టర్లను బస్సులపై ప్రదర్శించాలని ఆర్టీసీ అధికారులను సూచించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, గంజాయి రవాణా నిరోధానికి ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నామని తెలిపారు. పోలీస్, ఎక్సైజ్ శాఖల సమన్వయంతో తనిఖీలు నిర్వహిస్తూ, రోజువారీగా కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా నర్సీపట్నం, ఎలమంచిలి ప్రాంతాల్లో రైల్వే మార్గాల ద్వారా గంజాయి రవాణా జరుగుతున్న నేపథ్యంలో, రైల్వే స్టేషన్లు, రైళ్లపై ప్రత్యేక నిఘా ఉంచి అనుమానితులను తనిఖీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ సత్యనారాయణరావు, రవాణా, వ్యవసాయ, విద్య, అటవీ, ఎక్సైజ్, గిరిజన, సాంఘిక సంక్షేమ, ఇంటిలిజెన్స్, ఇంటర్మీడియట్ బోర్డు, వైద్య ఆరోగ్యశాఖ, డ్రగ్ కంట్రోలర్, జీఆర్పీ, ఆర్పీఎఫ్ తదితర శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## వాటర్ బాడీస్ పై ఆక్రమణ తొలగింపుకు చర్యలు..

### -జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్

**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 30**
జిల్లాలో కబ్జాకు గురైన వివిధ శాఖలకు చెందిన వాటర్ బాడీస్ పైన ఆక్రమణలను తొలగించి జల వ్యవస్థలను సంరక్షించేందుకు పటిష్టమైన చర్యలను సమిష్టిగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లాలోని చెరువులు, కాలువలు, డ్రయిన్లు, వాగులు తదితర వాటర్ బాడీస్ సంరక్షణకు ఏర్పాటైన వాచ్ డాగ్ కమిటీ జిల్లా స్థాయి కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధ్యక్షతన జరిగింది. జిల్లాలో వాటర్ బాడీస్ పై ఆక్రమణలు తొలగింపుకు చేపడుతున్న చర్యల పురోగతి, నోటీసులు జారీ సమావేశంలో జేసీ.. అధికారులుతో చర్చించారు. ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ.. తాగు, సాగునీటి అవసరాల కొరకు నిర్దేశించిన వాటర్ బాడీల ఆక్రమణల కారణంగా నీటి నిల్వ, నియంత్రణలు వ్యవస్థలు విచ్ఛిన్నమై నీటి కొరతతో పాటు, సహజ ప్రవాహాలకు అవరోధాలు ఏర్పడి వరదలు,అధిక వర్షాల సమయంలో ముంపు, మురుగు సమస్యలు ఎదురౌతున్నాయన్నారు. ఇటువంటి పరిస్థితుల నివారించేందుకు భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలను పటిష్టంగా జిల్లాలో అమలు చేసేందుకు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో జిల్లా, డివిజన్, మండల స్థాయిలో వాచ్ డాగ్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. జిల్లాలో వాటర్ బాడీస్ పై సంబంధిత అధికారులు నిరంతర నిఘా, పర్యవేక్షణ చేయాలని జేసీ అధికారులకు స్పష్టం చేశారు. ఆక్రమణలను సత్వరం తొలగించేందుకు డివిజన్, మండల రక్షణ కమిటీలు చర్యలను ముమ్మరం చేయాలని జేసీ ఆదేశించారు. క్షేత్రస్థాయిలోని రెవెన్యూ,



పంచాయతీ, డ్రైనేజీ, జలవనరుల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి డివిజన్ స్థాయిలో సమగ్ర ప్రణాళిక రూపొందించి ఆక్రమణ తొలగింపుకు చర్యలు తీసుకోవాలన్నారు. గొల్లప్రోలు మండలం చందుర్తి లోని చెరువులపై ఉన్న ఆక్రమణలో తక్షణమే తొలగించాలని ఆయన ఆదేశించారు. డ్రైనేజీ ఇంజనీరింగ్ అధికారులు కాకినాడ నగరంలోని ఆక్రమణలపై దృష్టి పెట్టాలన్నారు. కేవలం నోటీసులు జారీ చేయడం మాత్రమే కాకుండా నోటీసులు జారీ చేసి నిర్దిష్ట సమయం దాటిన వాటికి చట్ట ప్రకారం తొలగింపు పనులు వెంటనే చేపట్టాలని జేసీ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డా.టి.తిప్పేనాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రియా, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లి బాబు, ఎన్.శ్రీధర్, ఇరిగేషన్, కాలుష్య నియంత్రణ మండలి, డ్రైనేజి, మున్సిపల్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఖానామెట్టు చెరువు కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి: సీపీఐ డిమాండ్

**శేరిలింగంపల్లి, మాదాపూర్, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 30 :**
శేరిలింగంపల్లి మండల పరిధిలోని ఖానామెట్టు చెరువుకబ్జాపై సీపీఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు, టీ రామకృష్ణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లేని సర్వే నంబర్లను సృష్టించి కోట్లాది రూపాయల విలువైన చెరువులు, నాలాలను కబ్జా చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై వారు మండిపడ్డారు. కూకట్‌పల్లి సర్వే నంబర్ల పేరుతో కానామెట్టు చెరువును కబ్జా చేసి చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నేతలు డిమాండ్ చేశారు. పేదల గుడిసెలను కూల్చే హైడ్రా (న్ణ=ూూ) అధికారులకు, ధనవంతుల అక్రమ కట్టడాలు కనిపించడం లేదా అని వారు ప్రశ్నించారు. తక్షణమే ఈ నిర్మాణాలను కూల్చివేసి, కబ్జాదారులను అరెస్టు చేయాలని, లేనిపక్షంలో అధికారులు కబ్జాదారులతో కుమ్మక్కయ్యారని భావించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ విషయంపై కలెక్టర్ మరియు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేస్తామని,




స్పందన లేకుంటే కోర్టు ద్వారా న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చందు యాదవ్, వెంకటస్వామి, రాములు, కాసిం తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్మెంట్ అయినా ఏఎస్ఐ ఎండి అబ్దుల్ గఫార్ నీ సన్మానించిన జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు



**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఏప్రిల్ 30**
నాగర్ కర్నూల్ జిల్లాలో ఊరుకొండ పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ ఎండి అబ్దుల్ గఫార్ రిటైర్మెంట్ అయినందున జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించడం జరిగింది రిటైర్మెంట్ అనేది ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో అందరూ ఎదుర్కొనేదని రిటైర్మెంట్ తర్వాత పిల్లాపాపలతో ఆయురారోగ్యాలతో మంచి శేష జీవితాన్ని గడపాలని దీవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులతో పాటు నాగర్ కర్నూల్ జిల్లా అడిషనల్ ఎస్ పి ఎన్ వెంకటేశ్వర్లు నాగర్ కర్నూల్ ఏవో కృష్ణయ్య , డిసిఆర్బి ఎస్ఐ రమేష్ , స్పెషల్ బ్రాంచ్ ఎస్సై తాజుద్దీన్ నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు ఏఎస్ఐ గుణ వర్ధన్ తో పాటు సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## హైదరాబాద్‌లో 'టావర్' చికిత్సలకు పెరుగుతున్న ఆదరణ లిగతేడాదితో పోలిస్తే 34 శాతం వృద్ధి!



**శేరిలింగంపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 30**
భాగ్యనగరంలో అధునాతన వైద్య విధానాలకు ఆదరణ పెరుగుతోంది. ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలతో బాధపడే వృద్ధులకు వరంగా మారిన టావర్ (ూూం=)లిలి శస్త్రచికిత్సల సంఖ్య నగరంలో గణనీయంగా పెరిగింది. గతేడాదితో పోలిస్తే ఈ చికిత్సల నమోదులో 34 శాతం వృద్ధి కనిపించడం విశేషం. సాధారణంగా 60 ఏళ్లు పైబడిన వారిలో గుండె ప్రధాన కవాటం ఇరుకుగా మారే 'అయోర్టిక్ స్టెనోసిస్' సమస్య తలెత్తుతుంటుంది. గతంలో దీనికి ఓపెన్ హార్ట్ సర్జరీ తప్పనిసరి అయ్యేది. కానీ, ఇప్పుడు ట్రాన్స్‌క్యాథెటర్ అయోర్టిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ విధానం ద్వారా తక్కువ కోతతో, రక్తనాళాల ద్వారానే కవాటాన్ని మార్చే వీలు కలుగుతోంది. హైదరాబాద్‌లో ప్రస్తుతం ఏడాదికి 350 నుండి 400 వరకు టావర్ సర్జరీలు జరుగుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే 34 శాతం పెరుగుదల నమోదైంది. ఈ సందర్భంగా ఏఐజీ హాస్పిటల్స్ కార్డియాక్ క్యాత్ ల్యాబ్ డైరెక్టర్ డాక్టర్ అనుజ్ కపాడియా, కో-డైరెక్టర్ డాక్టర్ స్వరూప్ భరడి వారు మాట్లాడుతూ వృద్ధుల్లో కనిపించే ఆయాసం, అలసట, ఛాతీలో అసౌకర్యం వంటి లక్షణాలను కేవలం వృద్ధాప్య సమస్యలుగా భావించి నిర్లక్ష్యం చేయకూడదు. అవి గుండె కవాట సమస్యలకు సంకేతం కావచ్చు అని తెలిపారు. నగరంలోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న అత్యాధునిక మౌలిక సదుపాయాలు, నిపుణులైన వైద్య బృందాల కృషితో ఈ క్లిష్టమైన సర్జరీలు విజయవంతమవుతున్నాయి. వృద్ధులలో జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ఈ అధునాతన వైద్య విధానం కీలక పాత్ర పోషిస్తోందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## వయోపరిమితి సడలింపు ఇవ్వాలని జేసీని కల్సిన దళిత చైతన్య వేదిక



**రాజోలు సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 30**
అంగన్వాడీ కార్యకర్తల, సహాయకుల నియామక ఎంపికలో ఎస్సీ ఎస్టీ వర్గాలకు వయోపరిమితిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం సడలింపు ఇవ్వాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా జాయింట్ కలక్టర్ వైఖోమ్ నిడియా దేవి ని దళిత చైతన్య వేదిక నాయకులు కల్సి మెమోరాండం ఇచ్చారు.ఈ మేరకు దళిత చైతన్య వేదిక నాయకులు రాజోలు పట్టణంలో మాట్లాడుతూ అంగన్వాడీ నియామక ఎంపికలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ ఎస్టీ వర్గాలకు వయోపరిమితిలో మినహాయింపు ఇవ్వకపోవడం వలన లబ్ధిదారులైన మహిళా అభ్యర్థులు తీవ్ర అసహనానికి లోనౌతున్నారని జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నిడియా దేవికి తెలియచేసామన్నారు. జాయింట్ కలక్టర్ ఎస్సీ ఎస్టీ వర్గాలకు వయోపరిమితిలో సడలింపు ఇచ్చే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని దళిత చైతన్య వేదిక నాయకులు ఈ సందర్భంగా తెలియచేసారు. ఈ కార్యక్రమంలో దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకులు బత్తుల మురళీకృష్ణ, వేదిక జిల్లా అధ్యక్షులు లిఖితపూడి బుజ్జి, వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డపల్లి ప్రసాద్, ఎస్సీ సంక్షేమ సంఘం రాజోలు మండల అద్యక్షులు మట్టా సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అప్పనపల్లి కాజ్‌వే నిర్మాణానికి శంకుస్థాపన

## - ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

**మామిడి కుదురు సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 30**

:డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, మామిడికుదురు మండలం పరిధిలోని అప్పనపల్లి వద్ద కాజ్‌వే నిర్మాణానికి పి. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,మామిడికుదురు -- అప్పనపల్లి -- పెదపట్నంలంక రహదారిని మొత్తం 6.300 కిలోమీటర్ల పొడవున అభివృద్ధి పరచుటకు కేంద్ర ప్రభుత్వ సి.ఆర్.ఎఫ్. గ్రాంట్ కింద రూ.14.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో రహదారి అభివృద్ధి పనులకు రూ.9.50 కోట్లు, కాజ్‌వే నిర్మాణానికి రూ.5.00 కోట్లు కేటాయించబడినట్లు వివరించారు. ఇప్పటికే పాశర్లపూడి, అప్పనపల్లి, దొడ్డవరం గ్రామాలలో 3.900 కిలోమీటర్ల సిమెంట్ రహదారి నిర్మాణ పనులు పూర్తయ్యాయని, మిగిలిన 2.400 కిలోమీటర్ల పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కాజ్‌వే నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని, ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని పేర్కొన్నారు. రైతులు, విద్యార్థులు, ఉద్యోగులకు ఈ ప్రాజెక్టు ద్వారా గణనీయమైన ఉపశమనం కలుగుతుందని అన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి,



ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ సహకారం కారణమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.



## ఏపీ,తెలంగాణ హోంగార్డుల బదిలీలు ఎప్పుడూ?

# 11 ఏళ్లుగా ఎదురుచూపులు



**అమరావతి, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :30**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత రెండు రాష్ట్రాల మధ్య హోంగార్డుల బదిలీ సమస్య ఇంకా పరిష్కారం కాని కీలక అంశంగా మారింది. 2014 జూన్‌లో రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు హోంగార్డులు తెలంగాణలోనే కొనసాగాల్సిన పరిస్థితి ఏర్పడగా, తెలంగాణకు చెందిన కొందరు హోంగార్డులు ఆంధ్రప్రదేశ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులను స్థానికత ఆధారంగా పునర్వ్యవస్థీకరించినప్పటికీ, హోంగార్డుల విషయంలో మాత్రం చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. హోంగార్డులు తమ అసలు విధులతో పాటు అదనపు పనుల్లోనూ వినియోగించబడుతున్నారని, కొన్నిసార్లు ఉన్నతాధికారుల వ్యక్తిగత అవసరాలకు కూడా ఉపయోగించుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబాలకు దూరంగా పనిచేయడం వల్ల వారు మానసికంగా, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రవాణా ఖర్చులు పెరగడం, కుటుంబాన్ని విడిచి ఉండాల్సి రావడం వంటి సమస్యలు రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ప్రత్యేకంగా, దాదాపు 15 ఏళ్లుగా తెలంగాణలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ హోంగార్డులు తమ కుటుంబాలు స్వరాష్ట్రంలో ఉండటంతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను చూసుకునే అవకాశం లేకపోవడం, పిల్లల చదువులు రెండు రాష్ట్రాల్లో విభజించబడడం వంటి సమస్యలు వారి కుటుంబ జీవనాన్ని సంక్లిష్టంగా మారుస్తున్నాయి. ఇదే పరిస్థితి తెలంగాణకు చెందిన హోంగార్డులకూ ఎదురవుతోంది. ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వాల దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లినా స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం హోంగార్డుల్లో అసంతృప్తిని పెంచుతోంది. ముఖ్యంగా, హోంమంత్రి మరియు ఉన్నతాధికారులకు పలు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ స్పందన రాకపోవడం బాధాకరమని వారు పేర్కొంటున్నారు. అంతేకాకుండా, బదిలీలు ఆలస్యం కావడంతో భవిష్యత్తులో స్థానికత కోల్పోయే ప్రమాదం ఉందని హోంగార్డులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నస్థాయి ఉద్యోగులైన వీరి ఆర్థిక పరిస్థితులు కూడా దెబ్బతింటున్నాయి. కుటుంబ బాధ్యతలు, పిల్లల విద్య, వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణ అన్ని కలిపి వారి జీవితాన్ని సంక్షోభంలోకి నెట్టుతున్నాయి. ఈ నేపథ్యంలో, హోంగార్డుల సమస్యల పరిష్కారానికి రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు తక్షణమే చర్చలు జరిపి, స్థానికత ఆధారంగా బదిలీల ప్రక్రియను ప్రారంభించాలని హోంగార్డులు కోరుతున్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకుని, వేలాది కుటుంబాలకు ఉపశమనం కల్పించాల్సిన అవసరం ఉందని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మండల ఎస్ ఎస్ సి ఫలితాలలో ప్రథమ స్థానం...



**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 30**

కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో విడుదలైన యస్.యస్.సి. ఫలితాలలో 584 మార్కులు సాధించిన యం. లోకనందిని పాఠశాల ప్రథమ స్థానం లో నిలిచింది. 66 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 66 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ విద్యార్థిని పాఠశాల కమిటీ ఛైర్మన్ కొండా కిషోర్ బాబి కుమార్తెకావడం విశేషం. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొల్ల మందల చిట్టిబాబు, ఎం ఈ ఓ కిషోర్ కుమార్, వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అభినందనలు తెలియజేశారు.


## పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో చౌడమ్మ అమ్మవారి దేవస్థానానికి శంకుస్థాపన

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 30**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం డి జి పేట రోడ్డులో గంగమ్మ గుడి దేవస్థానం పక్కన పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో చౌడమ్మ అమ్మవారి దేవస్థాన నిర్మాణానికి బుధవారం ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. శంకుస్థాపన కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు ఈ సందర్భంగా పద్మశాలి సంఘం నాయకులు మాట్లాడుతూ చౌడమ్మ అమ్మవారు తమ ఆరాధ్య దైవమని, భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమంలో రెబ్బా బాలయ్య, నాయుడు నారాయణ, నాయుడు రవి, గువ్వల చలపతి, రెబ్బా కొండయ్య, రెబ్బా చౌడయ్య, సంఘ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కనకదుర్గమ్మను దర్శించుకున్న టిడిపి నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి



**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 30**

గిద్దలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి గురువారం విజయవాడ ఇంద్రకీలాద్రి పై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, ఆలయ మండపంలో వేద పండితులు ఆయనకు వేద మంత్రోచ్ఛారణలతో ఆశీర్వచనం అందజేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## పదవ తరగతి ఫలితాల్లో ఒంగోలు గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థినుల ఉత్తమ ఫలితాలు



**కల్చరల్ రిపోర్టర్, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 30**

10వ తరగతి ఫలితాలలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల బండ్లమిట్ట ఒంగోలుకు చెందిన విద్యార్థినులు ప్రభుత్వ పాఠశాలల నుండి ఒంగోలు డివిజన్ స్థాయిలో సి.హెచ్.యశశ్విని సరస్వతి (591)ఒంగోలు మండల స్థాయిలో 1,2,3 స్థానాలను వరుసగాగా యశశ్విని సరస్వతి(591), ఎస్.ప్రవల్లిక (588),బి..వేదశ్రీ (587) కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.క్రిష్ణకుమారి మాట్లాడుతూ మొదటగా ఇంత మంచి ఫలితాలు సాధించిన తమ స్టాఫ్, విద్యార్థినులకు అభినందనలు తెలియచేశారు. 100రోజుల యాక్షన్ ప్లాను అమలు చేయుటలో అనుక్షణం ప్రోత్సహిస్తూ ముందుండి నడిపించిన అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారిణి సివి రేణుక, మండల విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలియచేశారు.

## భక్తిశ్రద్ధలతో లక్ష్మీనరసింహ జయంతి





**మార్కాపురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 30**

పట్టణంలోని శ్రీ కపిలగిరి యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం స్వామి జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం ధ్వజరోహణము కార్యక్రమం, పంచామృతం- స్నపన సహస్రనామార్చన, ఉత్సవ మూర్తులకు పంచామృత స్నపన తీరుమంజనము ఘనంగా నిర్వహించారు.సాయంత్రం చందనత్సవం, చందన సేవ, శ్రీ నరసింహ స్వామి జననం, రాత్రి స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. ఈ జయంతి మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదలను స్వీకరించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో భజన చేశారు. నరసింహస్వామి కీర్తనలు ఆలపించారు.

## సంజీవరావ్ పేట హైస్కూల్‌లో సెంట్ పర్సెంట్

**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 30**

గిద్దలూరు మండలం సంజీవ రావు పేట ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ ఏడాది జరిగిన పరీక్షలకు మొత్తం 17 మంది విద్యార్థులు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణత సాధించడం విశేషం. పాఠశాలలో ఎం. దీపిక 552/600 మార్కులతో మొదటి ర్యాంకు సాధించింది. ఎం. రమేష్ 543/600 మార్కులతో రెండవ ర్యాంకు, హరిత 539/600 మార్కులతో మూడవ ర్యాంకు పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల కృషిని అభినందిస్తూ, వారి భవిష్యత్తు విజయవంతంగా కావాలని ఆకాంక్షించారు.

## శీలంవారిపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం





**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 30**

కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో నాల్గొవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిభిరం లో భాగంగా ఆరోవ రోజు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.గురువారం శీలంవారిపల్లి గ్రామంలో డాక్టర్.పుండరీకాక్ష రావు గారు గ్రామంలోని ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి వివిధ ఆరోగ్య సమస్యలకు మందులు అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుర్వేదం యొక్క ప్రయోజనాలను మరియు సహజ ఆరోగ్య సంరక్షణ పద్ధతుల ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా ఈకార్యక్రమంలో వ్యవసాయ అధికారి పి. మధుబాబు మరియు ఏఈఓ శ్రీను ఈ కార్యక్రమంలో పాల్గొని వివిధ వ్యవసాయ పథకాలు రైతుల కోసం డిజిటల్ అప్లికేషన్ మరియు వాటి సమర్ధవంతమైన వినియోగం పై అవగాహన కల్పించారు.

## ఉపాధి హామీ పనులను తనిఖీ చేసిన సెక్రటరీ సుమలత

**ఉలవపాడు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 30**


ఉలవపాడు మండలంలోని వీరేపల్లి గ్రామపంచాయతీ పెద్ద చెరువులో జరుగుతున్న వీబి జీ రామ్ జీ ఉపాధిహామీ పనులను స్థానిక సెక్రటరీ సుమలత గురువారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో భాగంగా పనుల నాణ్యత, కూలీల హాజరు మరియు రికార్డులను పరిశీలించి, లక్ష్యాలమేర పనులు చేసి పూర్తి కూలీ పొందాలని కూలీలకు సూచించారు. తనిఖీ సమయంలో కూలీలతో నేరుగా ఆమె సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలు వేసవి దృష్ట్యా ఎండవేడిమి ఎక్కువ ఉన్నదని తెలుపడంతో సెక్రటరీ వెంటనే స్పందించారు. వేసవి తీవ్రతతో ఎండలో పనిచేస్తున్న కూలీలకు నీడ కోసం చలువ పందిళ్లు, ఓఆర్ఎస్ లు, ప్రమాదాల సమయంలో తక్షణ చికిత్స అందించేందుకు మెడికల్ కిట్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ తో పాటు మేట్ లకు, ఏ.ఎన్.ఎం విజయ కుమారికి సెక్రటరీ సూచించారు. ఉపాధిహామీ పనులను అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సెక్రటరీ సుమలత తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సుమలతతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ భరత్(ఇంచార్జ్), మేట్ గొల్లపూడి శివ తదితరులు పాల్గొన్నారు.





నేహా శర్మ చిక్ మరియు సొగసైన స్టైల్ స్టేట్‌మెంట్‌లో స్టన్స్

# రౌడీ జనార్ధన కోసం భారీ యాక్షన్ సీక్వెన్స్!



రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నటిస్తున్న భారీ మాసీవ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ -రౌడీ జనార్థన-. రవి కిరణ్ కోలా దర్శకత్వం వహిస్తున్నాడు. దిల్ రాజు అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ మూవీ షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. కీర్తి సురేష్ తొలి సారి విజయ్‌కి జోడీగా నటిస్తుండటం, విజయ్ ఫస్ట్ టైమ్ పక్కా మాస్ క్యారెక్టర్ చేస్తుండటంతో ఈ మూవీపై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఈ సినిమాలో విజయ్ దేవరకొండ పలికే తూర్పు గోదావరి యాస ప్రధాన హైలైట్‌గా నిలవనుంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టైటిల్ గ్లింప్స్ అంచనాల్ని పెంచేసింది. 80వ దశకంలో సాగే పొలిటికల్ యాక్షన్ డ్రామా ఇది. ఇందు కోసం డిఫరెంట్ మేకోవర్‌తో విజయ్ దేవరకొండ నటిస్తున్నాడు. టీజర్‌లో రౌడీ పాత్రలో విజయ్ సరికొత్తగా కనిపించిన తీరు అభిమానుల్ని, సినీ లవర్స్‌ని విశేషంగా ఆకట్టుకుంటూ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. రాయలసీమ ప్రాంతంలో జరిగిన ఓ పొలిటికల్ ఎమోషనల్ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా దర్శకుడు రవి కిరణ్ కోలా దీన్ని తెరకెక్కిస్తున్నాడు.విజయ్‌తో బ్లాక్ బస్టర్ హిట్‌ని అందించాలనే పట్టుదలతో దిల్ రాజు ఈ మూవీని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మే చివర్లో రామోజీ ఫిల్మ్ సిటీలో కొత్త షెడ్యూల్‌ని ప్రారంభించి సాంగ్‌తో పాటు భారీ యాక్షన్ సీక్వెన్స్‌ని పూర్తి చేయాలని టీమ్ ప్లాన్ చేస్తోంది. ఈ మూవీకి ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ అత్యంత కీలకంగా నిలుస్తుందని ఇన్ సైడ్ టాక్.ఈ ఎపిసోడ్‌లో విజయ్ దేవరకొండ ఫుల్ యాక్షన్ మోడ్‌లో కనిపించి కేక పెట్టిస్తాడని తెలుస్తోంది. రౌడీలకే రౌడీగా విజయ్ దేవరకొండ నటిస్తున్న సినిమా కావడం, ఇందులో మునుపెన్నడూ లేనంతగా మాస్ క్యారెక్టర్‌లో విజయ్ దేవరకొండ నటిస్తుండటంతో అభిమానులు, సినీ లవర్స్ ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. శరవేగంగా షూటింగ్‌ని పూర్తి చేసి ఇదే ఏడాది డిసెంబర్‌లో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.గత కొంత కాలంగా వరుస ఫ్లాపుల్లో ఉంటూ తనదైన మార్కుని కోల్పోయిన విజయ్ దేవరకొండ ఈ మూవీతో స్ట్రాంగ్ కమ్ బ్యాక్ ఇవ్వాలని బలంగా కోరుకుంటున్నాడు. అందుకే ప్రతి విషయంలోనూ చాలా జాగ్రత్తలు తీసుకుంటూ ఈ సినిమా చేస్తున్నాడట. ఈ విషయాన్ని ఆ మధ్య విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్‌తో ఫుల్ క్లారిటీ ఇచ్చేయడంతో మళ్లీ రౌడీ రైజింగ్ అవ్వబోతున్నాడని ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు.



కృతి శెట్టి గ్రేస్ మరియు గ్లామర్ యొక్క విజన్

## టీమిండియా కెప్టెన్ గా రిషభ్ పంత్.. పడిక్కల్, నబీలకు బెస్ట్ ఛాన్స్!










ఐపీఎల్ ముగిసిన వెంటనే వారం రోజుల గ్యాప్ లో టీమిండియాతో ఆఫ్ఘనిస్తాన్ జట్టు ఒక టెస్ట్ మ్యాచ్ ఆడనుంది. జూన్ 6 నుంచి 10 వరకు ఈ టెస్ట్ మ్యాచ్ జరగనుంది. దాదాపు 8 ఏళ్ల తర్వాత ఆఫ్ఘన్ తో భారత క్రికెట్ జట్టు రెడ్ బాల్ క్రికెట్ ఆడుతుండడం విశేషం. ఎలాగో టెస్ట్ ఛాంపియన్ షిప్ లో ఆఫ్ఘనిస్తాన్ భాగం కాకపోవడంతో ఈ టెస్టులో సీనియర్స్ ను రెస్ట్ లభించడం ఖాయంగా కనిపిస్తుంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రాలతో కొంత మంది స్టార్ ప్లేయర్స్ కి రెస్ట్ ఇవ్వాలని సెలెక్టర్లు ఆలోచిస్తున్నట్టు సమాచారం. కేఎల్ రాహుల్, మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజాలు కూడా ఈ ఏకైక టెస్ట్ మ్యాచ్ ఆడకపోవచ్చు. గిల్ రెస్ట్ తీసుకోవడంతో వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ జట్టుకు కెప్టెన్ గా వ్యవహరించనున్నాడు. ఐపీఎల్ ముగింపుకూ, ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగే ఏకైక టెస్టు ఆరంభానికి మధ్య చాలా తక్కువ సమయం ఉంది. ఆటగాళు అలసిపోకుండా వారి పని భారాన్ని దృష్టిలో పెట్టుకొని సెలెక్టర్లు, జట్టు యాజమాన్యం జాగ్రత్త తీసుకుంటున్నట్లు వార్త కథనాలు వస్తున్నాయి. టెస్ట్ సిరీస్ ముగిసిన వెంటనే మన జట్టు ఆఫ్ఘనిస్తాన్‌తో మూడు వన్డేలు ఆడాల్సి ఉంది. 2027లో వన్డేవరల్డ్ కప్ ఉండడంతో ఈ మూడు వన్డేల సిరీస్ కు పూర్తిస్థాయి భారత జట్టు బరిలోకి దిగనుంది. ఆఫ్ఘనిస్తాన్ తో జరగబోయే ఏకైక టెస్టుకు సీనియర్స్ కు రెస్ట్ ఇస్తే వన్డే సిరీస్ కు రెండు వారాల విరామం లభిస్తుంది. అప్పుడు వర్క్ లోడ్ లేకుండా వన్డే సిరీస్ లో ప్లేయర్స్ ఆడతారు. ఏదైనా ఐపీఎల్ ముగిసేలోపు అధికార ప్రకటన రానుంది.

స్టార్ ప్లేయర్స్ రెస్ట్ తీసుకోవడంతో ఇప్పుడు దేశవాళీ క్రికెట్ లో బాగా రాణించిన వారికి ఈ టెస్ట్ మ్యాచ్ లో ఛాన్స్ లభిస్తుంది. డొమెస్టిక్ క్రికెట్ లో పరుగుల వరద పారిస్తున్న దేవ్ దత్ పడికల్ తో పాటు గత రంజీ ట్రోఫీలో 10 మ్యాచ్ ల్లోనే 60 వికెట్లు పడగొట్టిన ఔకిబ్ నబీకి ఛాన్స్ దక్కనుంది. వీరిద్దరిపైనే అందరి దృష్టి నెలకొంది. సెలెక్టర్లను ఆకట్టుకున్న వారిలో ఫాస్ట్ బౌలర్ గుర్నూర్ బ్రార్, స్పిన్నర్ మానవ్ సుతార్ కూడా ఉన్నారు. ఐపీఎల్ ఫైనల్‌కు, ఆఫ్ఘనిస్తాన్ టెస్టుకు మధ్య పెద్దగా విరామం లేదు. కాబట్టి ఆటగాళ్లు అలసిపోకుండా సెలెక్టర్లు, యాజమాన్యం జాగ్రత్త పడతారు. ఎందుకంటే టెస్ట్ తర్వాత ఆఫ్ఘనిస్థాన్ తో మూడు వన్డేలు, ఆ తర్వాత ఇంగ్లాండ్‌లో వైట్-బాల్ సిరీస్ ఉన్నాయి. శుభ్‌మన్ గిల్ స్థానంలో మిడిల్ ఆర్డర్ లో పడికల్ ఆడనున్నాడు. జడేజా, కుల్దీప్ కు రెస్ట్ ఇస్తే ఆ స్థానంలో మానవ్ సుతార్ కు అవకాశం దక్కొచ్చు. బుమ్రా ప్లేస్ లో ఆకీబ్ నబీ జట్టులోకి రానున్నాడు. ఓపెనర్ రాహుల్ స్థానంలో సాయి సుదర్శన్ జట్టులోకి రావొచ్చు. యంగ్ స్టార్స్ కు అవకాశమిస్తే రానున్న ఏడాదిలో టీమిండియా కీలక టెస్ట్ సిరీస్ లలో వీరికి అవకాశం దక్కనుంది. వీటిలో ప్రధానంగా న్యూజిలాండ్ లో రెండు టెస్టులతో పాటు ఆస్ట్రేలియాతో 5 టెస్ట్ మ్యాచ్ ల బోర్డర్- గవాస్కర్ ట్రోఫీ ఆడాల్సి ఉంటుంది. 2027 ఎండింగ్ లో వరల్డ్ కప్.. అదే ఏడాది జూన్ లో టెస్ట్ ఛాంపియన్ షిప్ ఉండడంతో భారత్ ఈ రెండు ఫార్మాట్ల పైనే ఎక్కువగా దృష్టి పెట్టనుంది.

## ఆర్సీబీపై రివేంజ్ తీర్చుకున్న టైటాన్స్.. ఘోరంగా ఓడిన బెంగళూరు







ఐపీఎల్ 2026లో భాగంగా అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా జరిగిన హై-వోల్టేజ్ పోరులో గుజరాత్ టైటాన్స్ అదరగొట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిర్దేశించిన 156 పరుగుల లక్ష్యాన్ని కేవలం 15.5 ఓవర్లలోనే ఛేదించి, 5 వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీని నమోదు చేసింది. ఈ విజయంతో టైటాన్స్ పాయింట్ల పట్టికలో ఓ అడుగు ముందుకు వేసింది.

**గిల్ మెరుపు ఇన్నింగ్స్:**
లక్ష్య ఛేదనలో గుజరాత్ ఓపెనర్లు మంచి ఆరంభాన్ని ఇచ్చారు. 42 పరుగుల వద్ద సాయి సుదర్శన్ (6) భువనేశ్వర్ కుమార్ బౌలింగ్‌లో అవుట్ అయినప్పటికీ, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (18 బంతుల్లో 43; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) ఆర్సీబీ బౌలర్లను ఒక ఆటాడుకున్నాడు. హాఫ్ సెంచరీకి చేరువవుతున్న సమయంలో భువీ బౌలింగ్‌లో విరాట్ కోహ్లీకి క్యాచ్ ఇచ్చి గిల్ వెనుదిరిగాడు. అనంతరం జోస్ బట్లర్ (19 బంతుల్లో 39; 2 ఫోర్లు, 4 సిక్సర్లు) తనదైన శైలిలో సిక్సర్లతో విరుచుకుపడి మ్యాచ్‌ను ఏకపక్షం చేశాడు. మధ్యలో షారుఖ్ ఖాన్, వాషింగ్టన్ సుందర్ (11) తక్కువ స్కోరుకే అవుట్ అయి ఉత్కంఠ రేపినప్పటికీ, చివర్లో రాహుల్ తెవాటియా భారీ షాట్లతో ఫినిషింగ్ టచ్ ఇచ్చి జట్టుకు విజయాన్ని అందించాడు.

**భువీ పోరాటం వృథా:**
ఆర్సీబీ బౌలర్లలో వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్ (3 వికెట్లు) అద్భుతంగా బౌలింగ్ చేసి గుజరాత్ టైటాన్స్‌ను కట్టడి చేసే ప్రయత్నం చేశాడు. రొమారియో షెపర్డ్ రెండు వికెట్లు తీయగా, సుయాష్ శర్మకు ఒక వికెట్ దక్కింది. అయితే స్వల్ప స్కోరు కావడంతో బెంగళూరు బౌలర్లు ఓటమిని అడ్డుకోలేకపోయారు. కేవలం 15.5 ఓవర్లలోనే మ్యాచ్ ని ఖతం చేసేసింది గుజరాత్.

## "బర్త్ డే భాయ్" రోహిత్ శర్మ ట్రాక్ రికార్డ్.. కోహ్లీ, సచిన్ వల్ల కూడా కాలేదుగా









భారత క్రికెట్ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన ప్లేయర్స్ లలో ఒకరైన హిట్ మ్యాన్, రోహిత్ శర్మ నేడు తన 39వ పుట్టినరోజును సెలబ్రేట్ చేసుకుంటున్నాడు. స్టేడియంలో పరుగుల వరద పారించడమే కాదు, కెప్టెన్‌గా టీమిండియాకు ప్రపంచ కప్‌లను అందించిన ఈ 'హిట్‌మ్యాన్' పేరిట కొన్ని అద్భుతమైన రికార్డులు కూడా ఉన్నాయి. ఆధునిక క్రికెట్‌లో వాటిని అధిగమించడం ఇప్పటి వరకు ఏ బ్యాటర్‌కైనా అంత సులభం కాదు. అవేంటో ఇప్పుడు ఒకసారి చూద్దాం..

డబుల్ సెంచరీల కింగ్: వన్డేల్లో ఒక్క డబుల్ సెంచరీ కొట్టడమే గగనమైన వేళ, రోహిత్ శర్మ ఏకంగా మూడుసార్లు ఈ రికార్డుని సాధించి చరిత్రలోకి ఎకెక్కాడు. ఆస్ట్రేలియాపై ఒకసారి, శ్రీలంకపై రెండుసార్లు డబుల్ సెంచరీలు కొట్టి 'డబుల్ సెంచరీల కింగ్' అని పిలుపించుకున్నాడు. వరల్డ్ లో మరే ఇతర బ్యాటర్ కూడా ఇప్పటి వరకు ఈ స్థాయికి చేరుకునేందుకు ప్రయత్నం కూడా చేయలేకపోయాడు. వరల్డ్ కప్‌లో అత్యధిక సెంచరీలు: ప్రపంచ కప్ లాంటి భారీ టోర్నీలలో రోహిత్ శర్మ ప్రదర్శన అమోఘం.. వన్డే వరల్డ్ కప్ చరిత్రలో అత్యధికంగా 7 సెంచరీలు కొట్టిన రికార్డు అతడి పేరుపైనే ఉంది. ఈ క్రమంలో ఆయన సాక్షాత్తు సచిన్ టెండూల్కర్ ఘనతని కూడా అధిగమించాడు. ముఖ్యంగా 2019 వరల్డ్ కప్‌లో ఒకే టోర్నీలో 5 శతకాలు సాధించి రికార్డు సృష్టించాడు.వన్డే క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు: క్రికెట్ ప్రపంచం ఎప్పటికీ గుర్తు పెట్టుకునే రికార్డు రోహిత్ శర్మ పేరుపైనే ఉంది. 2014లో కోల్‌కతా వేదికగా శ్రీలంకపై జరిగిన మ్యాచ్‌లో రోహిత్ శర్మ ఏకంగా 264 రన్స్ సాధించి వరల్డ్ రికార్డు సృష్టించాడు. ఒక ఇన్నింగ్స్‌లో 33 ఫోర్లు, 9 సిక్సర్లతో విరుచుకుపడి.. ఈ మైలురాయిని చేరుకోవడం ప్రస్తుత తరం ప్లేయర్స్ కి ఒక కలగానే మిగిలిపోయింది.

ఇంటర్నేషనల్ క్రికెట్‌లో సిక్సర్ల రారాజు: సిక్సర్లు బాదడంలో రోహిత్ శర్మకు సాటి ఎవరూ రాలేదు.. క్రికెట్ 3 ఫార్మాట్లలో కలిపి మొత్తం 650కి పైగా సిక్సర్లు బాది వరల్డ్ లోనే అగ్రస్థానంలో నిలిచాడు. వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ పేరుపై ఉన్న ఘనతని తుడిచి పెట్టిన హిట్ మ్యాన్, తన అద్భుతమైన టైమింగ్‌తో 'సిక్స్ మెషీన్'గా గుర్తింపు తెచ్చుకున్నాడు.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776